నవతెలంగాణ

1

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం | 19 డిసెంబర్ 2023 | www.navatelangana.com

బిగ్‌బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్ రోడ్‌షో



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

సామాన్య రైతుబిడ్డ బిగ్‌బాస్ విన్నర్ కావడం హర్షించదగ్గ విషయమని పలువురు అన్నారు. బిగ్‌బాస్ సీజన్ సెవెన్‌లో విజేతగా నిలిచిన పల్లవి ప్రశాంత్ అభిమానులు సోమవారం గజ్వేల్‌లో రోడ్‌షో నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ప్రజ్ఞాపూర్ చేరుకున్న పల్లవి ప్రశాంత్ చౌరస్తా నుంచి గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించారు. వేలాది మంది అభిమానులు స్వాగతం పలికారు. బిగ్‌బాస్ టైటిల్ ట్రోఫీని జనాలకు చూపుతూ మూడు కిలోమీటర్ల దూరం రోడ్‌షోతో సందడి చేశారు. విద్యార్థులు రైతు బిడ్డ విజయాన్ని చూసి ఉప్పొంగి పోయారు. ప్రశాంతన్న అంటూ ఆయనకు షేకండ్ ఇచ్చారు. డీజే సౌండ్ మధ్య భారీ బాణాపంచాలు కాల్చారు. మీ అందరి అభిమానమే నన్ను విజేతగా నిలిపిందని కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి పొన్నంను కలిసిన హుస్నాబాద్ నాయకులు



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ, బీసీ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొన్నం ప్రభాకర్‌ను సోమవారం హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకులు మంత్రి ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిత్తారి పద్మ రవీందర్, మండల అధ్యక్షుడు బంక చందు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్

రూ.375 కోట్ల నిధులు విడుదల



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మాత్యులుగా పొన్నం ప్రభాకర్ సోమవారం సచివాలయంలో బాధ్యతలు చేపట్టారు. మొదటగా మంత్రి తన ఛాంబర్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు మంత్రి పొన్నంకు ఆశీర్వచనాలు అందించారు. మంత్రి పొన్నం మొదటగా రూ.375 కోట్ల నిధులు విడుదల చేస్తూ ఆర్టీసీ ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. మంత్రితో రవాణా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణీ ప్రసాద్ సంతకం చేయించారు. ఆర్టీసీకి మూడో త్రైమాసిక బడ్జెట్ కింద పలు రాయితీల కోసం రూ.375 కోట్ల నిధులు మంత్రి పొన్నం విడుదల చేశారు. కరోనా సమయంలో మృతి చెందిన రవాణా శాఖ ఉద్యోగి పండు బాబు కుటుంబానికి రూ.లక్ష పరిహారం ఫైల్‌పై మంత్రి సంతకం చేశారు. ప్రిన్సిపాల్ సెక్రటరీతో పాటు ఆర్టీసీ ఎండి విసి సజ్జనార్ ఉన్నారు.

మంత్రి పొన్నంను కలిసి శుభాకాంక్షలు

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొన్నం ప్రభాకర్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, కవంపల్లి సత్యనారాయణ మేడిపల్లి సత్యం, మాజీ ఎంపీలు మధియాష్కి మైనంపల్లి హనుమంతరావు, బలరాం నాయక్ అంజన్ కుమార్ యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్ రావు ఠాక్రే, టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, సెక్రటరీలు రోహిత్ చౌదరి, విష్ణునాథ్ తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి మార్కెట్ ఎదుట పట్టు రైతుల నిరసన



నవ తెలంగాణ - సిద్దిపేట

సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి పట్టుగూళ్ల మార్కెట్ ముందు సిద్దిపేట జిల్లా పట్టు రైతుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా నుంచి వెళ్లిన రైతులు సోమవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నాణ్యమైన పట్టుగూళు తీసుకెళ్లినప్పటికీ తిరుమలగిరి, జనగామ మార్కెట్లలో సరైన ధర రావడం లేదని తెలిపారు. విక్రయించిన గూళ్లకు సరిగా డబ్బులు రావడం లేదని, నెలల తరబడి డబ్బులకు ఇబ్బంది పెడుతున్నామని తెలిపారు. ఇకనైనా పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్, ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. పట్టుగూళ్లకు సరైన నాణ్యమైన ధర లభించేలా చూడాలని కోరారు. అమ్మినగూళ్లకు త్వరగా డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా పట్టు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దోళ్ల ఐలయ్య, కోశాధికారి రాజు ,కార్యవర్గ సభ్యులు బొగ్గుల నరసింహులు, పిల్లి శ్రీనివాస్, తులసి రామ్, పిల్లి పెద్ద శ్రీనివాస్, రమేష్, రవీందర్, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల తోపులాట

40 నిమిషాల పాటు వాగ్వాదం



నవతెలంగాణ-కౌడిపల్లి

మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులుకాని బీఆర్‌ఎస్ నాయకులు సభా వేదిక మీద ఎలా కూర్చుంటారని బీజేపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. మండల కేంద్రమైన కౌడిపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరయ్యారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రగౌడ్‌లను స్టేజీపై కూర్చోబెట్టడం ఏంటని బీజేపీ జిల్లా నాయకుడు రాజేందర్, మండల అధ్యక్షుడు రాకేష్ ఎమ్మెల్యే సునీతారెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక టీఆర్‌ఎస్ పదవులు తొలగించబడ్డాయని, బీఆర్‌ఎస్ నాయకులను స్టేజీపై కూర్చోబెట్టటం ఏంటని గొడవకు దిగారు. ఏ అర్హతతో వీరిని స్టేజ్‌పై కూర్చోబెట్టారని, అన్ని పార్టీల వారిని స్టేజీపై కూర్చోబెట్టి రాజకీయ నాయకుల సభగా చేయాలనుకుంటున్నారా అని సునీతారెడ్డిని ప్రశ్నించారు. భూస్వాములు, రియల్టర్లు, టీఆర్‌ఎస్ నాయకులకే బీసీ బంధు ఇవ్వటమేకాక ప్రభుత్వం మారాక కూడా స్టేజీపై అదే జోరు సాగిస్తున్నారని 40 నిమిషాల పాటు బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులు తోపులాడుకున్నారు. బీజేపీ నాయకుడు రాకేష్‌ను టీఆర్‌ఎస్ నాయకులు బయటకు నెట్టేసి సమావేశ మందిరానికి తలుపులు పెట్టారు. ఇలాగే కొనసాగితే ప్రజల సమస్యల సభ ఉండదని, ఇక రాజకీయ నాయకుల సభగానే మారుతుందని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కానిది సర్వసభ్య సమావేశం అవుతుందా అంటూ సునీతారెడ్డిని ప్రశ్నించారు. అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వాగ్వాదానికి దిగిన బీజేపీ నాయకులతో రామాగౌడ్ కలుగజేసుకొని మా మండల్ మా ఇష్టం వచ్చినవారికి ఇస్తాం మీకు అవసరం లేదు మీరు వెళ్లిపోండి అని అనడం ఏంటని వాపోయారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ గొడవలు లేకుండా అన్ని వర్గాలవారికి సముచిత న్యాయం చేస్తామని, సమస్య తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడవద్దని తెలిపారు.

అదుపుతప్పి కళాశాల వాహనం బోల్తా

పలువురు విద్యార్థులకు గాయాలు



నవతెలంగాణ-బెజ్జంకి

అదుపుతప్పిన కళాశాల వాహనం బోల్తా పడిన సంఘటన మండల పరిధిలోని దాచారం గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ డిగ్రీ కళాశాల వాహనం సోమవారం విద్యార్థులను వారి ఇండ్లకు చేరవేస్తున్న క్రమంలో దాచారం గ్రామ శివారులోని మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన పోలంలో బోల్తా కొట్టింది. డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడపడం వల్ల అదుపుతప్పి పోలంలోకి దూసుకెళ్లింది. వాహన ముందు భాగం అద్దాలు ధ్వంసమయ్యాయి. కళాశాల వాహనంలో సుమారు 20 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనలో విద్యార్థినిక తీవ్ర గాయం కాగా పలువురికి స్వల్ప గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. వివరాల కోసం పోలీసులను కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

మెదక్ ఎంపీ బరిలో సోనియా!

- తెలంగాణ నుంచి పోటీ చేయాలని పీఏసీ తీర్మానం
- పరిశీలనలో మెదక్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్
- ఏదో ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేసే ఛాన్స్
- మంత్రులకు పార్లమెంట్ నియోజకవర్గాల బాధ్యతలు
- పార్లమెంట్ ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాల దక్కించుకునే వ్యూహం
- మెదక్‌లో సోనియా పోటీ చేస్తే బీఆర్‌ఎస్‌కు కష్టకాలమే



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించింది. పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో పలు కీలకమైన అంశాలపై చర్చించిన ఆ పార్టీ నేతలు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలించేందుకు వ్యూహరచన చేశారు. ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ తెలంగాణ నుంచి ఎంపీగా పోటీ చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీతో పాటు ప్రియాంకకు అపూర్వ ఆధరణ లభించింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రియాంక పోటీ చేయనున్నట్లు కూడా కాంగ్రెస్ నేతలు పలు చోట్ల ప్రకటించారు. మెదక్ పార్లమెంట్ నుంచి పోటీ చేసే అవకాశాలున్నాయనే చర్చ నడిచింది. తాజాగా కాంగ్రెస్ పీఏసీలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రియాంక కాకుండా సోనియా గాంధీని తెలంగాణ నుంచి ఎంపీగా పోటీ చేయించే ఆలోచనలో కాంగ్రెస్ నేతలున్నారు. సోనియా గాంధీని పోటీకి దించాల్సి వస్తే ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు లాభం చేకూరుతుందనే అంచనాలు వేశారు. పీఏసీలో పరిశీలించిన నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల పేర్లలో మెదక్ ఉన్నందన ఆమె పోటీ చేయవచ్చంటున్నారు. సోనియా గాంధీ మరో చోట పోటీ చేస్తే మెదక్ నుంచి ఎవర్ని పోటీకి దించితే గెలిచే అవకాశాలున్నాయనే అంశాలపై కాంగ్రెస్ అధిష్టానం ఆరా తీస్తోంది. బీఆర్‌ఎస్ బలంగా ఉన్న మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలవాలంటే బలమైన అభ్యర్థినే బరిలోకి దించాలని టీపీసీసీ నేతలు భావిస్తున్నారు.

మెదక్‌తో గాంధీ కుటుంబానికి అనుబంధం

ఉమ్మడి మెదక్ జిల్లాతో గాంధీ కుటుంబానికి ఎంతో అనుబంధముంది. సుదీర్ఘ కాలం దేశానికి ప్రధాన మంత్రిగా పని చేసిన ఇందిరాగాంధీ 1980 పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీగా పోటీ చేశారు. దక్షణ భారత దేశంలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఎన్నికల ప్రచార సభల్లో ఆమె మెదక్ జిల్లాలో పర్యటించారు. ఆ ఎన్నికల్లో ఆమె భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఐదేళ్లు ఎంపీగా కొనసాగిన ఆమె అప్పట్లో పార్లమెంటరీ పార్టీ లీడర్‌గా ఎన్నికైన 1980 జనవరి 14న ప్రధానమంత్రి పదవి చేపట్టారు. దీంతో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే విధంగా రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడో యాత్ర సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించారు. నాయనమ్మ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంగారెడ్డి జిల్లాలో కాలినడకన సాగుతూ ప్రజలతో మమేకమయ్యారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సంగారెడ్డి, ఆందోల్ ఎన్నికల సభల్లో రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రియాంక గాంధీ జహీరాబాద్, హుస్నాబాద్ సభల్లో ప్రచారం చేశారు.

అనాడు అత్త.. నేడు కోడలు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా అప్పట్లో ఇందిరాగాంధీ పోటీ చేయగా వచ్చే ఎన్నికల్లో కోడలు సోనియా గాంధీ పోటీ చేసే అవకాశముంది. ఎందుకంటే కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో చేసిన పలు తీర్మానాల్లో భాగంగా సోనియా గాంధీ తెలంగాణ నుంచి ఎంపీగా పోటీ చేయాలని తీర్మానం చేశారు. ఆ తర్మానంలో పేర్కొన్న పలు నియోజకవర్గాల్లో మెదక్ కూడా ఉండడంతో ఆమె ఇక్కడి నుంచే పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. మెదక్ నుంచి సోనియాగాంధీ పోటీ చేయడం వల్ల బీఆర్‌ఎస్‌ను ఢీకొనడమే కాకుండా ఉత్తర తెలంగాణలోని పలు నియోజకవర్గాలపై కూడా ప్రభావం పడుతుందంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రచారం చేసిన ప్రియాంక గాంధీ గురించి కూడా చర్చ జరిగింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రియాంక గాంధీ మెదక్ ఎంపీగా పోటీ చేస్తారంటూ కాంగ్రెస్ నాయకులు పలు చోట్ల ప్రకటనలు చేశారు. ప్రియాంక స్థానంలో సోనియా గాంధీని పోటీ చేయాల్సిందిగా పీఏసీలో తీర్మానం చేయడంతో ప్రియాంక పోటీ చేసే అవకాశంలేదని తేలింది. దీంతో సోనియా గాంధీ తెలంగాణ నుంచి పోటీ చేసేందుకని సిద్ధపడితే తప్పనిసరిగా మెదక్ నుంచే పోటీ చేయవచ్చంటున్నారు. సోనియా గాంధీ పోటీ చేయనిపక్షంలో మెదక్ ఎంపీగా పలువు కాంగ్రెస్ నాయకుల పేర్లు వినిపిస్తున్నాయి. గతంలో ఎంపీగా గెలిచిన విజయశాంతి మెదక్ ఎంపీ టికెట్ కోరుతున్నట్లు తెలుస్తోంది. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి కూడా ఎంపీగా పోటీ చేసే అవకాశాలున్నాయంటున్నారు. ఒకవేళ ఆయనకు ఎమ్మెల్సీ లేదంటే మరో ప్రోటోకాల్ పదవి వస్తే మాత్రమే విజయశాంతికే అవకాశముంటుందంటున్నారు. మెదక్ ఎంపీ పరిధిలో బీఆర్‌ఎస్‌కు ఆరు చోట్ల గెలుపొందినందున కాంగ్రెస్ నుంచి గెలువగల్గిన నాయకులకే టికెట్ వచ్చే అవకాశముంది.

పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి

పార్లమెంట్ ఎన్కికలు త్వరలోనే జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ముందస్తుగానే సన్నద్ధమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ అదే జోష్‌ను కొనసాగించి పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎక్కువ స్థానాల్లో గెలవాలని చూస్తోంది. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే అత్యధిక పార్లమెంట్ స్థానాల్లో గెలవాలి. అందుకని కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో 17 ఎంపీ స్థానాల్లోనూ గెలవాలని చూస్తోంది. అందుకోసం తీవ్రమైన కరసత్తు చేస్తోంది. ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిందన్న పేరుంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావానికి సోనియా గాంధీయే ముఖ్య కారణమనే చర్చను కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో బలంగా తీసుకెళ్లగలిగింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ సోనియా గాంధీ పర్యటించారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆమెను పోటీ చేయించాలని చూస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాలకు మంత్రివర్గ సభ్యులను బాధ్యులుగా నియమించారు. ఒక్కో మంత్రికి ఒక్కో నియోజకవర్గం చొప్పున బాధ్యతలు అప్పజెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ కాంగ్రెస్ అభ్యర్థిని గెలుపించుకోవాల్సిన కర్తవ్యాన్ని కూడా నూరిపోశారు. మెదక్ పార్లమెంట్ నియోజవకర్గం బాధ్యతలను మంత్రి దామోదర్ రాజనర్సింహకు అప్పజెప్పారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌ను సమన్వయం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే బాధ్యత కూడా మంత్రులకే అప్పజెప్పారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మెదక్ అసెంబ్లీ స్థానంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలిచారు. మిగతా ఆరు స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలిచింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున ఆ ఊపు పార్లమెంట్ ఎన్నికల్లోనూ కొనసాగే అవకాశముంది. పైగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నందున ఆ పథకాల ప్రభావం కూడా కాంగ్రెస్‌కు కలిసిరానుంది. ప్రభుత్వపరంగా పార్టీపరంగా ప్రజల్లో మమేకమై పని చేయడం ద్వారా మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని వ్యూహంగా కనిపిస్తోంది.

డబ్బులు ఇస్తేనే ఇంటికి పర్మిషన్

- ఇంటి పర్మిషన్ కోసం లంచం రూ.5 వేలు
- ఎంపీడీవో కార్యాలయం వద్ద బాధితుల నిరసన



నవతెలంగాణ- కౌడిపల్లి

నూతన ఇల్లు నిర్మాణం పర్మిషన్ కోసం ఎనిమిది నెలలుగా చెప్పులరిగేలా తిరుగుతున్నా... ఇదేమీ పట్టించుకోకుండా లంచం ఇస్తేనే సంతకం పెడతానని గ్రామ కార్యదర్శి వేధిస్తున్న ఉదంతం మండలంలో వెలుగులోకి వచ్చింది. బాధితులతు కౌడిపల్లి మండలం సలాబత్ పూర్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రాజు, జక్కపల్లి సత్యనారాయణ గౌడ్‌ల కథనం ప్రకారం... కౌడిపల్లి మండలం సలాబత్ పూర్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రాజు, జక్కపల్లి సత్యనారాయణ గౌడ్ ఇద్దరు ఇంటి నిర్మాణం కోసం గ్రామ కార్యదర్శి ఆకుల కృష్ణ వద్దకు ఎన్నిసార్లు తిరిగినా రేపుమాపు అంటూ సాకులు చెబుతున్నాడు. పైసల్ ఇస్తేగానీ పని అవ్వదంటూ పంచాయతీ చుట్టూ ఎనిమిది నెలలుగా తిప్పుతున్నాడు. సోమవారం మండల కేంద్రమైన కౌడిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఉన్నందున బాధితులు అధికారులకు చెప్పుకుంటే అయినా సమస్య తీరుతుందని వస్తే కార్యదర్శి అడ్డుకున్నారు. మీరు ఎందుకు వచ్చారు? ఎవరి దగ్గరికి వెళ్లినా సమస్య తీర్చేది నేనే.. నేను చేయకుంటే ఎవరూ చేయరని బాధితులతో గొడవకు దిగాడు. ఈ విషయమై ఏపీవో పుణ్యాసుకు చెబితే... సమస్య ఉన్నప్పుడు ఇవ్వక తప్పదని సమాధానం చెప్పారు. గ్రామ కార్యదర్శితో పలుమార్లు మాట్లాడినప్పటికీ సరైన సమాధానం చెప్పకుండా డబ్బులు ఇస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని, లేదంటే అవదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ లేనిపోని సాకులు చెబుతూ కాలం వెళ్లదిశాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు రాజు ఎంఏపీజీ చేసి ఉద్యోగం లేకపోవడంతో ఏడు సంవత్సరాలుగా బైక్ మెకానిక్ షాపు నిర్వహించుకుంటున్నాడు. అప్పు చేసి ఇంటి నిర్మాణం చేశాడు. లోన్ తీసుకోవడానికి సర్టిఫికెట్‌పై సంతకం చేయమంటే లంచం తీసుకోవడం ఏంటని చదువుకున్నోళ్ల వద్దనే డబ్బులు వసూలు చేస్తే ఇక నిరుపేద రైతన్న వద్ద డబ్బులు ఎంత వసూలు చేస్తారో.. అంటూ ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఇంటి నిర్మాణం కోసం పర్మిషన్ ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని బాధితులు వాపోయారు. కూలీనాలి చేసుకుని బతికేటోళ్ల దగ్గర డబ్బులు తీసుకుంటే మా బతుకులు ఎట్లా ఉంటాయని పేర్కొన్నారు. ఇప్పటికే భార్య వద్ద ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.5 వేలు ఇచ్చానని, ఇప్పటికీ నోడ్యూ సర్టిఫికెట్‌పై సంతకం పెట్టకుంటే ఆత్మహత్యనే దిక్కు అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శితో మాట్లాడిన ప్రతి విషయం ఫోన్లో రికార్డు చేశామని, ఉన్నతాధికారులకు రికార్డును అప్పగిస్తామని బాధితులు తెలిపారు. ఇప్పటికే ఇద్దరి వద్ద రూ.10 వేల చొప్పున గ్రామ కార్యదర్శికి లంచం డబ్బులు ముట్టాయని, వీటికి ఎలాంటి రిసిప్టు ఇవ్వలేదని అన్నారు. నోడ్యూ సర్టిఫికెట్ కోసం మరో చెరి రూ.5 వేల చొప్పున లంచం అడుగుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ముందు కార్యదర్శితో అరగంట పాటు గొడవకు దిగారు. తోటి కార్యదర్శులు వచ్చి సర్ది చెప్పినా గ్రామ కార్యదర్శి ఆకుల కృష్ణ తమను దబాయించాడని బాధితులు వాపోయారు. ఎవరు వచ్చినప్పటికీ సంతకం పెట్టను.. ఏమైనా చేసుకోండి.. ఎవరికైనా చెప్పుకోండి.. అంటూ గ్రామ కార్యదర్శి ఆకుల కృష్ణ బాధితులతో నిర్లక్ష్య సమాధానం చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఎంపీడీవో కార్యాలయం వద్ద సర్టిఫికెట్లతో ఆవేదన వ్యక్తం చేశారు బాధితులు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు ఇవ్వకుంటే..

విధులు బహిష్కరిస్తాం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు



నవతెలంగాణ-సంగారెడ్డి: కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే విధులను బహిష్కరిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు అన్నారు. సోమవారం ఆధ్వర్యంలో సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ల్లా కార్యదర్శి జి. సాయిలు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. 11వ పిఆర్సి చైర్మెన్ సిఫారసు చేసిన వేతనాలు రూ.19 వేలు, రూ.22,900, రూ.31,040 కనీస వేతనాలుగా నిర్ణయించి ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఒకే రకమైన పనులు చేస్తున్న వారి మధ్య వేతన వ్యత్యాసాలు ఉండరాదని, కాంట్రాక్టు కార్మికునికి సైతం పర్మినెంట్ ఉద్యోగులతో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ఫిఎఫ్ ఖాతాల ఆధారంగా కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. అనేకమంది కార్మికులు మ్యాన్హోల్స్, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేసే సమయంలో ప్రమాదాలు జరిగి మరణిస్తున్నారని, అలాంటివారికి ఎలాంటి నష్ట పరిహారం చెల్లించడం లేదని అన్నారు. పారిశుధ్యం, వీధిదీపాలు, పార్కుల నిర్వహణ, నర్సరీలు, డంపింగ్యార్డులు డ్రైనేజీ క్లీనింగ్ తదితర పనులు చేస్తున్న కార్మికుల ఆత్మగౌరవం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మున్సిపల్ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, వారిని పర్మినెంట్, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరి, సువర్ణ, సురేష్, లక్ష్మణ్, యాదగిరి, శ్రీనివాస్, నర్సింలు, సురేందర్, సంగీత, లక్ష్మీ, మల్లేశం, రాములు, శివరాజ్, ఆంజనేయులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను హాజరు శాతం పెంచాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో ఎంఈవో, ఎంఎన్ఓ, సిఎచ్ఎస్, ఉపాధ్యాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే మూడు నెలలు ఏ ఒక్క ఉపాధ్యాయుడు సెలవు తీసుకోకుండా పనిచేయాలని సూచించారు. పాఠశాలలో టిఎల్ఎంను ఒక పోస్టర్ మాదిరిగా కాకుండా పిల్లలకు పాఠ్యాంశం సులభంగా అర్థమయ్యే విధంగా ఒక టెక్నిక్ తరహాలో స్టూడెంట్స్‌తో ఇంట్రాక్ట్ అయ్యే విధంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లా విద్యాధికారి మొదలు మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అలాగే కిందిస్థాయి సిబ్బంది ఉపాధ్యాయులు సైతం రాబోయే మూడు నెలలకు సంబంధించి ప్రతినెల వారీగా టూర్ డైరీని తయారు చేసుకుని తమ సంతకంతో తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. 5 రోజులు ట్రాన్సాక్షన్ 1 రోజు అసెస్మెంట్ చేయాలని సూచించారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ సంబంధిత పోర్టల్ లో ప్రతిరోజు ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి, లక్ష్ యాప్ లో విద్యార్థుల హాజరు శాతం ఇతరత్రా వివరాలు తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని, యాప్ లో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా డీఈఓ దృష్టికి తీసుకు రావాలని ఆదేశించారు. డీఈఓ రాష్ట్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి సమస్య తెలిపి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యా సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా సిద్దిపేట జిల్లాను రాష్ట్రంలోనే పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అగ్రగామిగా నిలిపేందుకు జిల్లాలోని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 100 శాతం హాజరయ్యేలా చూసి, ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత అయ్యే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని, ప్రతి మండలాల్లో ఎంఈఓలు, హెచ్ఎంలతో సమావేశం నిర్వహించాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి ఎంఈఓ మీకు కేటాయించిన పాఠశాలలను తప్పనిసరిగా విజిట్ చేసి పాఠశాలలో జరుగుతున్న పాఠ్యాంశ బోధన, మధ్యాహ్న భోజన పథకం ఇతరత్రా అంశాల్ని ప్రతి ఒక్కటి పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీ పీరియడ్ తప్పనిసరిగా కేటాయించాలని, అలాగే జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా విద్యాధికారి, లేబర్ డిపార్ట్మెంట్ మరియు పోలీస్ శాఖల సమన్వయంతో పని చేయాలని కోరారు. జిల్లాలో ఇటుక బట్టీల వద్ద, భవన కార్మికుల, ఇతరత్రా ప్రదేశాలలో



పనిచేసే తల్లి దండ్రుల పిల్లల సైతం పాఠశాలలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని, దూరం ఉన్న ప్రాంతాలు గుర్తించి వర్క్ సైట్ స్కూల్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ లెబర్ ఆఫీసర్ మహమ్మద్ వికార్ బాబ, తదితరులు పాల్గొన్నారు.

ఫోర్‌లైన్ రోడ్డు వెడల్పు, బ్రిడ్జి పొడవును తగ్గించండి

- పాత మార్కు ప్రకారంగానే రోడ్డు నిర్మించాలి
- మిట్టపల్లిలో భూ బాధితుల నిరసన
- రోడ్డుపై బైఠాయించి బాధితుల ఆందోళన

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

మిట్టపల్లి గ్రామం మీదుగా నిర్మాణం చేస్తున్న ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులను పాత మార్కు ప్రకారం 100 ఫీట్ల వెడల్పుతోనే నిర్మించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన బాధితులు సోమవారం మిట్టపల్లి రైతు వేదిక వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సంతోష్, స్థానిక నాయకులు కనకమల్లయ్య మాట్లాడుతూ గతంలో రోడ్డు వెడల్పు 100 ఫీట్లు ఉంటుందని మార్కింగ్ చేసిన అధికారులు ఇప్పుడు 150 ఫీట్ల వెడల్పని మళ్లీ మార్కింగ్ ఛేంజ్ చేస్తున్నారని వాపోయారు. అప్పట్లో అధికారులు ఇచ్చిన 100 ఫీట్ల వెడల్పు మార్కింగ్ ఆదేశాల మేరకే ఇండ్ల నిర్మాణం చేపట్టామని, సుమారు 35 నుండి 40 వరకు ఇండ్లు అక్కడ నిర్మాణం చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతానికి 150 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపడితే నిర్మించుకున్న ఇండ్లతోపాటు ఖాళీగా ఉన్న ప్లాట్స్ కూడా పూర్తిగా నష్టపోతామన్నారు. పాత మార్కింగ్ ప్రకారం 100 ఫీట్లకే రోడ్డు నిర్మాణం చేపట్టాలని, బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా 600 మీటర్లు కాకుండా 300 మీటర్ల వరకే కుదించాలని డిమాండ్ చేశారు. గతంలో రైల్వేలైన్ నిర్మాణం కోసం భూములు పోగొట్టుకొని అందులో వచ్చిన డబ్బులతో ఇక్కడ ప్లాట్స్ కొనుక్కొని ఇంటి నిర్మాణం చేపట్టుకుంటే ఇప్పుడు అవీ మళ్లీ పోవడంతో తమకు ఆత్మహత్య శరణ్యం అవుతుందని బాధితులు వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని కోరారు.



సృజన టెక్ ఫెస్ట్‌ను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-మెదక్

సృజన టెక్ ఫెస్ట్‌ను వినియోగించుకోవాలని మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్ లత సోమవారం తెలిపారు. సృజన టెక్ ఫెస్ట్ అనేది సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్, డిప్లొమా ఎడ్యుకేషన్ విద్యార్థుల్లో మంచి సృజనాత్మక ఆలోచనలను, నూతన పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు కోసం ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ విద్యార్థులు పాల్గొని వారి ఆలోచనలు, సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు.

ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలంలోని బీబీపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మహారెడ్డి మధుసూధన్ రెడ్డి కుమార్తె ఎంగేజ్మెంట్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి, మహారెడ్డి విజయపాల్ రెడ్డి హాజరై నూతన జంటను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి సోదరులు జైపాల్ రెడ్డి, బీబీపేట్ సర్పంచ్ మహారెడ్డి రవీందర్ రెడ్డి, మహారెడ్డి వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బోర్లు వెంటనే వేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఝరాసంగం మండలం బిడకన్న గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ నుంచి దళిత రైతులకు మంజూరైన వ్యవసాయ బోర్లు వెంటనే వేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్ర శేఖర్‌కు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి దళిత రైతులకు మంజూరైన బోర్లు వెంటనే వేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, మండల నాయకులు చంద్రన్న ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యను విస్మరించొద్దు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఎవ్వరు కూడా విద్యను విస్మరిం చొద్దని.. ప్రతీ ఒక్కరూ విద్యకు ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో, ఎంపీపీ, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి, నర్సింలు ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలిసి వివరించారు నూతనంగా ఎమ్మెల్యే ఎన్నికైనందుకు మున్సిపల్ కార్మికులు సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో సాయిలు కుమార్ రవి ఆదామ్ నారాయణ అంబయ్య సాయిలు ఏసు తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీ రాజ్ ఏఈపై ఎంపీపీ ఫైర్

బిల్లులు సరిగ్గా చేయకపోవడం, ప్రోటోకాల్ పాటించకపోవడంపై నిలదీత



నవతెలంగాణ-ఝరాసంగం

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ కింద చేపట్టిన పనులకు ఏండ్లు గడుస్తున్న బిల్లులు ఎందుకు చేయడం లేదని.. తమకు అనుకూలంగా ఉన్నవారికే బిల్లులు చేయడం సరైన పద్ధతి కాదని, దీనిని మార్చుకోకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ అధికారిపై ఎంపీపీ కటికే దేవదాస్ ఫైర్ అయ్యారు. ఝరాసంగం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి సమావేశ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో సుజాత నిర్వహించారు. మండలంలో జరుగుతున్న వివిధ పనులపై తమకు ఇంటిమేషన్ ఇవ్వకుండా బిల్లులు ఎలా చేస్తారని, ప్రభుత్వ కార్యక్రమాలకు తమకు ఆహ్వానించక పోవడంపై ఎంపీపీ.. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారిపై తీవ్రంగా మండిపడ్డారు. మన ఊరు - మనబడి పథకం కింద ఎన్ని పాఠశాలలు ఎంపిక చేయబడ్డాయి? ఎన్ని పూర్తి చేశారు? ఇంకా పూర్తికానివి ఎన్ని ఉన్నాయి? ఎందుకు పూర్తి కాలేదు అనే అంశాలపై ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం కింద గతంలో నిర్మించిన రైతు కల్లాలకు ఇప్పటివరకు డబ్బులు రావడం లేదని, కూలీల డబ్బులు వారి వారి ఖాతాలలో జమ కావడం లేదని ఎంపీటీసీ సభ్యులు శంకర్ పాటిల్ సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేషన్ కింద బీడకన్నే గ్రామంలో 52 బోరు బావులకు మంజూరు ఇచ్చారని పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని ఎంపీపీ కోరారు. మండల వ్యాప్తంగా రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయని వాటికి మరమ్మతులు చేపట్టాలని వివిధ గ్రామాల సభ్యులు ఆయా శాఖల అధికారులకు విన్నవించారు. పలు గ్రామాల్లో అడవిపందుల బెడద తీవ్రతరమైందని.. అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని సభ్యులు కోరగా.. కొత్త ప్రభుత్వం ద్వారా అప్డేట్ వచ్చాక పర్మిషన్ ఇస్తామని తహసీల్దార్ సంజీవరావు సమాధానం ఇచ్చారు. ఈ సమావేశానికి విద్యాశాఖ, సమగ్ర శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి విభాగము, గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుధ్యం, ఇరిగేషన్ శాఖ, ఎక్సైజ్ శాఖ, సర్పంచులు సైతం హాజరు కాలేదు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లన్న పాటిల్, కోఆప్షన్ సభ్యులు ఎక్బాల్ జానీ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను ఎందుకు తనిఖీ చేయట్లేదు

- కేంద్రాల్లో పాడై పోయిన గుడ్లు, పాల నిల్వలు
- అధికారుల పర్యవేక్షణ ఏమైనట్టు?
- సర్వసభ్య సమావేశంలో ఐసీడీఎస్ సూపర్వైజర్‌ను నిలదీసిన సభ్యులు



నవతెలంగాణ-మునిపల్లి

అంగన్వాడీ సెంటర్లలో కాలం చెల్లిన పౌష్టికాహార పదార్థాలు ఉంటున్నాయని.. మీరు కేంద్రాలను ఎందుకు తనిఖీ చేయడం లేదంటూ సర్వసభ్య సమావేశంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ శైలజను సభ్యులు నిలదీశారు. మండల కేంద్రమైన మునిపల్లి ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ శైలజ అధ్యక్షతన సోమవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించగా పాడైపోయిన గుడ్లు, పాలు తదితర ఆహార పదార్థాలు ఉన్నాయని గుర్తించామన్నారు. వాటినే పిల్లలకు పెడితే.. రోగాలు రావా అని ప్రశ్నించారు. మీరు జీతాలు తీసుకోవడం లేదా అంటూ సూపర్‌వైజర్‌పై సర్పంచులు రమేష్, విశ్వనాథం, పీఏసీఎస్ చైర్మెన్ దుర్గయ్యలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రైతులకు ఇప్పటివరకు ఎకరాలోపే రైతుబంధు పడిందని.. ఇంకా ఎప్పుడు ఇస్తారంటూ సభ్యులు సభలో ప్రస్తావించారు. అందుకు ఏవో స్పందిస్తూ రైతులకు రైతుబంధు ప్రభుత్వం వేస్తున్నట్లు సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పైతర మీనాక్షి, ఎంపీడీవో హరి నందన్‌రావు, వైస్ ఎంపీపీ బాబా పటేల్, ఆయా శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

బస్సులు నడవని గ్రామాలకు బస్సులు వేయండి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ జోగు బాలయ్య



నవతెలంగాణ-జోగిపేట

మండల పరిధిలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదని.. ఆయా గ్రామాలకు బస్సులు వేయాలని ఎంపీపీ జోగు బాలయ్య అన్నారు. సోమవారం అందోల్ మండల సర్వసభ సమావేశాన్ని ఎంపీపీ బాలయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం గురించి సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆర్టీసీ కంట్రోలర్ ఫక్రుద్దీన్ స్పందించి.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్సులు అన్ని గ్రామాలకు వెళ్లేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఉచిత బస్సు ప్రయాణానికి మహిళల నుంచి మంచి స్పందన వస్తున్నదన్నారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాలతో పాటు పోలీస్ నిఘా పెంచాలన్నారు. విద్యుత్ బకాయిలు లేకుండా ఉన్నవారే.. గృహజ్యోతి పథకం కింద అందించే ఉచిత విద్యుత్‌కు అర్హులవుతారని జోగిపేట ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ అన్నారు. ఈ పథకానికి విధివిధానాలు ఇంకా రాలే దన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖాలకు చెందిన అధికారులు వారి వారి నివేది కలను సభ్యులకు చదివి వినిపించారు. రెండో విడుతలో గొర్రెల పంపిణీ పథకాన్ని లబ్దిదారులకు అందించే క్రమంలో తమకు సమాచారం ఇవ్వాలని ఎంపీడీవో సత్యానారయణ, ఎంపీపీ బాలయ్యలు నాదులాపూర్ వేటర్నరీ డాక్టర్ పాండ్య యస్‌కు సూచించారు.కార్యక్రమంలో ఎంఎడీవో సత్యనారాయణ, ఆర్అం డ్‌బీ ఏఈ మనోజ్, ఏఈవో శ్రీనివాస్, ఏపీ ఎం మాణిక్యం, ఏపీవోఅర్చన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 108 దరఖాస్తులు

- వాటి పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యతనివ్వాలి
- నిర్ణీత సమయంలోగా ప్రజావాణికి హాజరు కావాలి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజావాణి కార్యక్రమానికి 108 దరఖాస్తులు వచ్చాయని.. వాటి పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యతనివ్వాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. అలాగే అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి నిర్ణీత సమ యం లోగా హాజరుకావాలన్నారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణీలో.. అదనపు కలెక్టర్లు చంద్ర శేఖర్, మాధురి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ.. ప్రజావాణి ద్వారా వచ్చిన పిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలన్నారు. దరఖాస్తుదారుకు వెంటనే రిప్లై ఇవ్వాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు నిర్ణీత సమయంలోగా రాకుండా, లేటుగా రావడం పై అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో (108) దరఖాస్తులు రాగా.. అందులో 83 రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, ఇతర శాఖలకు సంబంధించి 25 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎన్నికలు పూర్తయినందున, ఇక శాఖాపరమైన కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రిస్మస్ పండగ సందర్బంగా జిల్లాలో క్రైస్తవులకు విందు భోజనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఆ విషయమై మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని కోరారు. మండల ప్రత్యేక అధికారులు తమతమ మండలాల్లో క్షేత్ర పరిధిలో తిరిగి, పూర్తిస్థాయిలో ఫీడ్ బ్యాక్ ఇవ్వాలన్నారు. తప్పనిసరిగా వసతి గృహాలను సందర్శించాలని, అన్ని సంక్షేమ వసతి గృహాలలో పిల్లలకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా, భోజనం సక్రమంగా అందుతుందా అన్న విషయాలను పరిశీలించాలన్నారు. వసతి గృహాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా కనెక్షన్స్ లేనట్లయితే సంబంధిత డీఈ, ఏఈలకు వెంటనే నివేదిక నివ్వాలన్నారు. అన్ని గ్రామాల్లో వసతి గృహాలలో మిషన్ భగీరథ నీటి సరఫరా సవ్యంగా జరగేలా చూడాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ తమ శాఖకు సంబంధించిన లక్ష్యాలు, పురోగతికి సంబంధించిన వివరాలను అప్డేట్ చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్ఓ నగేష్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాల సారాంశం ఒక్కటే

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్..



నవతెలంగాణ-రామచంద్రాపురం

అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ప్రతీ ఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమ ఆప్యాయతతో మెలగాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజి సొసైటీ గ్రౌండ్స్‌లో భారతినగర్ డివిజన్ పాస్టర్స్ మరియు ఇవాంజెలిస్ట్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్దలతో ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ పండుగను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమా ర్, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, నగేష్ యాదవ్, బీఆర్ ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, పాస్టర్ ప్రశాంత్, ఆయా చర్చల పాస్టర్లు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అమూల్య, శ్రీనివాస్‌లకు పది అవార్డులు

- మయూరి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో పది అవార్డులు అందజేత

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం సోలక్‌పల్లి గ్రామానికి చెందిన దాసరి అమూల్య రెడ్డి, మండల కేంద్రమైన జిన్నారానికి చెందిన చెందిన దళితరత్న ఏర్పుల శ్రీనివాస్‌లను ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పది వరల్డ్ రికార్డ్స్ అవార్డులు వరించాయి. ఈ మేరకు హైదరాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో మయూరి ఆర్ట్స్ సంస్థ.. వారికి ఈ అవార్డులను అందజేసింది. కూచిపూడి నృత్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి వేదికలపై అనేక ప్రదర్శనలతో పలువురు ప్రశంసలతో పాటు అనేక అవార్డులు అందుకున్న అమూల్య రెడ్డిని, సామాజిక కార్యక్రమాల్లో చైతన్యాన్ని పెంపొందిస్తున్న దళిత రత్న ఏర్పుల శ్రీనివాస్‌ను ఈ అవార్డులతో హైదరా బాదులోని భారతీయ విద్యా భవన్‌లో మయూరి ఆర్ట్స్ అధినేత రాధా దత్తు బృందం నేతృత్వంలో టాలెంట్ ఆఫ్ ది ఇయర్ 2023 కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమం లో డా.లయన్ సాయి వెంకట్, తెలుగు సినిమాల ప్రొడ్యూసర్, డైరెక్టర్ ,డా.బింగి నరేందర్ గౌడ్, ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండి యన్ చీఫ్ కోఆర్డినేటర్లా, సుభాషిని, హైకోర్టు సీనియర్ న్యాయవాది, విశ్వం వరల్డ్ రికార్డ్ కోఆర్డినేటర్ సాయి ప్రియ, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్ చీఫ్ కోఆర్డినేటర్ ర్లు పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న దాసరి అమూల్య రెడ్డి, దళితరత్న ఏర్పుల శ్రీనివాస్ లు.. సదరు సంస్థకు, అవార్డులు అందించిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.





వారు అందుకున్న అవార్డులు..

1. ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్,
2. ఇంటర్నేషనల్ కోహినూర్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్,
3. ఇంటర్నేషనల్ డైమండ్ వరల్డ్ రికార్డ్,
4. ఇంటర్నేషనల్ గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్,
5. ఇంటర్నేషనల్ జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్,
6. ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు,
7. ఇంటర్నేషనల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్,
8. ఇంటర్నేషనల్ విశ్వం వరల్డ్ రికార్డ్
9. ఇంటర్నేషనల్ స్టేట్స్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా,
10. ఇంటర్నేషనల్ ప్లాటినం బుక్ ఆఫ్ రికార్డ్స్



మంత్రి దామోదరకు సన్మానం

నవతెలంగాణ-మునిపల్లి

కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా బందేనవాజ్ దర్గాను తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సోమవారం దర్శించుకుని తిరిగి వస్తుండగా.. మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు ఆయన్ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో మాజీ ఎంపీపీలు రాజేశ్వర్ రావు, రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అసద్ పటేల్, పెద్దగోపురం ఎంపీటీసీ పాండు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, మాది కో ఆప్షన్ మెంబర్ రహీం తదితరులు ఉన్నారు.



తాటిపల్లి హైస్కూల్‌లో డీఈఓ ఆకస్మిక తనిఖీలు..

నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని తాటిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను జిల్లా విద్యాధికారి వెంకటేశం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ క్లాస్ ఎలా చెప్పున్నారు.. ఉపాధ్యాయులు సమయానికి వస్తున్నారా లేదా అని పదో తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదంటూ తన దృష్టికి వచ్చిందని, సమయానికి రాకుంటే చర్యలు తప్పవని.. డుమ్మా కొట్టే టీచర్లను హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈఓ దశరథ్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

గీతంలో క్విజ్, గణిత నమూనా ప్రదర్శన పోటీలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణిత శాస్త్ర విభాగం ఈనెల 21-22 తేదీల్లో జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థుల కోసం క్విజ్ పోటీతో పాటు గణిత నమూనా ప్రదర్శన, గీతం విద్యార్థుల కోసం గణిత క్విజ్ పోటీలను నిర్వహించనుంది. ఈ విషయాన్ని గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, ఈ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించా రు. విద్యార్థులకు గణిత శాస్త్రంపై మక్కు వను పెంపొందిం చడం, వారి గణిత నై పుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను అందించడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఈ పోటీల్లో 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవ చ్చని తెలిపారు. ఈ సందర్భంగా రెండు ఆతిథ్య ఉపన్యా సాలను కూడా ఏర్పా టు చేశామని, రామానుజన్ చరిత్ర, ఆయన సేవల గురించి ఉస్మానియా విశ్వవిద్యాలయ గణిత శాస్త్ర విభాగం పూర్య ఆచార్యుడు ప్రొఫెసర్ కె. సత్యనా రాయణ, కొన్ని సరదా వాస్తవాల గురించి గీతం సీఎస్ఈ డీన్ ప్రొఫెసర్ సి. విజయశేఖర్ ప్రసంగిస్తారన్నారు.ఆసక్తి గలవారు ఈ పోటీ కోసం తమ పేర్లను ఈనెల 20వ తేదీలోగా నమోదు చేసు కోవాలని, విజేతలను నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాల ను అందజేస్తామని డాక్టర్ మల్లికార్జున్ తెలియజేశారు. ఇతర వివరాల కోసం నిర్వాహకుడి(9849317334)ని సంప్రదించాలన్నారు.

గీతంను సందర్శించిన మహిళా పాలిటెక్నిక్ విద్యార్థులు..

సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. దాదాపు 230 మంది కంప్యూటర్ సైన్స్, ట్రిపుల్ ఈ, సివిల్,ఇంజనీరింగ్ డిప్లొమో తో పాటు హోమ్ సైన్స్ విద్యార్థులు, తమ అధ్యాపకులతో కలిసి వచ్చారు. గీతం నిర్వహిస్తున్న కార్యాచరణ - ఆధారిత అభ్యాసం ప్రత్య క్ష అనుభవాన్ని విద్యార్థులకు అందించడం ఈ సందర్శన ప్రాథమిక లక్ష్యం. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సె న్స్కు చెందిన అధ్యాపకులు వారితో ముఖాముఖి నిర్వ హిం చడంతో పా టు ఆయా విభాగాల ల్యాబొరేటరీలు, గ్రంథా లయం, ఇతర మౌలిక సదుపాయాలను చూపారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్ విద్యార్థులు, వారి అధ్యాపకుల కోసం వర్క్‌షాప్, వికాస కార్యక్రమాలను గీతం నిర్వహిస్తోంది.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ-జిన్నారం

పారిశ్రామిక పంచాయతీ ప్రాంతమైన కాజిపల్లిలోనీ సర్వేనెంబర్ 181లో గల నాలుగు అక్రమ ఇండ్ల నిర్మా ణాలను జిన్నారం తహసీల్దార్ రవికుమార్ ఆదేశాలతో మం డల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ, మండల సర్వే బృందంతో కలిసి జేసీబీల సహాయంతో సోమవారం కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాలాను పరిశీలించిన రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు..

జిన్నారం మండలంలోని 180 సర్వే నెంబర్‌లో నాలా ఇంక్రోచ్మెంట్ జరుగుతుందన్న సమాచారం నేపథ్యంలో ఇరిగేషన్ డీఈఈ రామస్వామి, ఏఈ దిలీప్ కుమార్, జిన్నారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ, సర్వేయర్ రామభద్రం బృందం సోమవారం ప్రత్యేకంగా సదరు భూములను పరిశీలించారు.

ఖేడ్ మున్సిపల్‌లో సమీక్షా సమావేశం

- పేదలకు, పెద్దలకు ఒకే పన్ను ఉండడం సరికాదు
- వేతనాలకే అధికంగా ఖర్చు అవుతున్నది.. సిబ్బందిని తగ్గించుకోవాలి
- సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఖేడ్ పట్టణంలోని మున్సిపల్ సమావేశంలో సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో పన్నులు, మిషన్ భగీరథ పైపులైను, నీటి సమస్యలు, మహిళా గ్రూపులకు లోన్‌లు తదితర అంశాలపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని.. పలు సమస్యల గురించి మున్సిపల్ కమిషనర్‌ను అడిగి తెల్సుకున్నారు. కమర్షియల్ టాక్స్‌లు పెంచాలని, మున్సిపల్ పన్నులను గ్రేడ్ ఆధారంగా వేయాలని ఎమ్మెల్యే సూచించారు. పేదలకు, పెద్దలకు ఒకే పన్ను సరికాదని.. మార్చాలని కమిషనర్ కు సూచించారు. పట్టణ ఆదాయం మొత్తం రెండు కోట్ల పైగా ఉన్నదని.. దానికనుగుణంగానే ఖర్చు పెట్టాలన్నారు. మున్సిపల్‌లో కార్మికులకు ఎక్కువగా ఉండడంతో వేతనాలకే ఎక్కువ మొత్తం వెళుతున్నదని.. కాబట్టి కొంతమంది సిబ్బందిని తగ్గించుకోవాలన్నారు. మున్సిపల్ పట్టణంలో మినిట్స్ బుక్ ఉన్నదా అని ఎమ్మెల్యే కమిషనర్‌ను ప్రశ్నించారు. కాగా కంప్యూటర్ ఆపరేటర్ లీవ్‌లో ఉన్నట్టు కమిషనర్‌గా చెప్పగా.. ఏ బడ్జెట్ ఎంత వచ్చిందో వివరాలు మొత్తం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. బడ్జెట్ కోసం ఎంపీని అడిగారా.. కౌన్సిలర్లు అందరూ ఎంపీని కలిసి వినతిపత్రం ఏమైనా ఇచ్చారా అని అడిగి తెల్సుకున్నారు. వార్డు ప్రజలకు వద్దకు నేరుగా వెళ్లి సమస్యల గురించి తెల్సుకోవాలని.. అవసరమైతే తానుకూడా వస్తానన్నారు. కలెక్టర్ ద్వారా ఏమైనా బడ్జెట్ ఉంటే ప్రపోజల్ పెట్టి.. వచ్చే విధంగా చూడాలని కమిషనర్‌కు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రూబీనా నజీబ్, వైస్ చైర్మెన్ పరశురాం, కౌన్సిలర్లు ఆనంద్ షెట్కార్, అభిషేక్ శెత్కర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
మంగళవారం | 19 డిసెంబరు 2023 | www.navatelangana.com

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని కొత్తపేట్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ నాయకుడు, ఉప సర్పంచ్ లచ్చయ్యతో పాటు పలువురు నాయకులు బీజేపీకి రాజీనామా చేసి సోమవారం శివంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు, అశోక్, రాజు నాయక్, పాండ్య నాయక్, శ్రీకాంత్, శివ రామ గౌడ్, సత్తయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన గౌటి బాబేష్



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సచివాలయం లో రాష్ట్ర ఫిషర్మెన్ సెక్రెటరీ గౌటి బాబేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా అభివృద్ధి పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల కోసం, పార్టీ కోసం పని చేయాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా చూడాలని మంత్రి పొన్న ప్రభాకర్ సూచించారు.

యువజనోత్సవాలను విజయవంతం చేయాలి

- పోస్టర్ విడుదల చేసిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-మెదక్

జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జిల్లా అధికారులతో కలిసి ఆయన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 22న నిర్వహించే ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి యువతీ యువకులు, కళాశాలల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. ఆధునిక యుగంలో మరుగున పడుతున్న సాంప్రదాయాలను వెలికి తీయాలనే ఉద్దేశంతో పాటు యువతలో దాగి ఉన్న కలలను బయటకి తీసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, డీఆర్డీఓ శ్రీనివాస్, డిపిఓ సాయి బాబా, డీఈఓ రాధాకిషన్, డిడబ్ల్యూఓ బ్రహ్మాజీ, ఇంటర్మీడిట్ జిల్లా అధికారి సత్యనారాయణలు పాల్గొన్నారు.

సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాలి

జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

నవతెలంగాణ-మెదక్



ప్రజా సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పలు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ప్రజల సమస్యలను తెలుసుకొని అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించిన తగాదాల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రాణభయం ఉన్నట్లు పలువురి నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై అదనపు ఎస్పీ స్పందిస్తూ చట్టప్రకారం బాధితులకు తగిన న్యాయం చేయాలని ఆయా పోలీసు స్టేషన్‌ల ఎస్ఐలను ఆదేశించారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన పాపయ్యగారి బాబు (30) గత నాలుగు రోజుల క్రితం కువైట్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. బాబు బాల్య స్నేహితులు, ఎంపీటీసీ లద్ద సురేష్, బిజ్జ మహేందర్, కమ్మరి చారిలు బాబు కుటుంబానికి సోమవారం రూ. 16 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ లద్ద సురేష్ మాట్లాడుతూ తమ బాల్య మిత్రుడు బాబును కోల్పోవడం బాధాకరమన్నారు. బాబుకు ఐదు సంవత్సరాలలోపు ముగ్గురు కుమారులు ఉన్నారని , వారికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల స్వామి ఆకుల తిరుపతి, ఆకుల రమేష్ , శివ గౌడ్, జలమంద రాజు, లద్ద కుమార్, కిరణ్, జక్కుల రమేష్, కనకరాజు, నాగరాజు, కట్ట సాయి, శ్రీవారి, బిజ్జ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రెడ్డిని పరామర్శించిన ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో మెదక్ సెగ్మెంట్ బీఆర్ఎస్ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి సోదరుడు శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం కంఠారెడ్డి తిరుపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. తిరుపతిరెడ్డిని పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోలిపేట రామ్ లింగారెడ్డి తనయుడు సతీష్ రెడ్డి, దుబ్బాక జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొత్త కిషన్ రెడ్డి, జన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

పల్లవి ప్రశాంత్‌ను అభినందించిన మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

నవతెలంగాణ-గజ్వేల్



బిగ్ బాస్ 7 విజేతగా నిలిచి గజ్వేల్ పేరు నిలబెట్టిన యువ రైతు పల్లవి ప్రశాంత్‌ను గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అభినందించారు. సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ గజ్వేల్ మండలం కోల్గూర్ గ్రామవాసి సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన పల్లవి ప్రశాంత్ యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. స్వయంకృషితో తనకు ఉన్న కళా నైపుణ్యంతో సోషల్ మీడియాలో ఎన్నో రకాల వీడియోలు చేసి రైతుల గురించి ప్రపంచానికి తెలియజెప్పి పల్లవి ప్రశాంత్ శభాష్ అనిపించుకున్నారన్నారు. స్టార్ మా టీవీ నిర్వహించిన బిగ్ బాస్ షో లో రైతు బిడ్డగా ప్రవేశించి బిగ్ బాస్ 7 విజేతగా నిలిచి స్వగ్రామానికి చేరుకున్న పల్లవి ప్రశాంత్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట



మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. దాదాపు 500 మంది నిరుపేదలకు ఇండ్ల స్థలాలకు సంబంధించి పట్టాలు ఇవ్వడంతో పాటు గృహాలు మంజూరు చేయాలని సర్పంచ్ సత్యనారాయణ కోరారు. అదేవిధంగా మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పెద్ద శంకరంపేట మండలానికి మంజూరైన మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాల ప్రస్తుతం పెద్ద శంకరంపేటలో స్థలం లేకపోవడం వల్ల నారాయణఖేడ్‌లో కొనసాగుతుందన్నారు. ఈ పాఠశాలను పెద్దశంకరంపేటలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దశంకరంపేట అభివృద్ధికి అన్ని విధాల సహకరించాలని సర్పంచ్ అలుగుల సత్యనారాయణ ఎమ్మెల్యేను కోరారు.

ప్రజావాణికి 87 ఫిర్యాదులు

- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు

నవతెలంగాణ-మెదక్



ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి జిల్లా నలుమూలల ధరణికి సంబంధించిన సమస్యలపై, మున్సిపల్ పరిధిలో అనుమతులు, ఇతర ధ్రువపత్రాల జారీ, ఉపాధి, ఉద్యోగం వంటి అంశాలపై ఫిర్యాదులు, దళిత బంధు, బీసీ బంధు డబుల్ బెడ్ రూం, పెన్షన్‌లు మొత్తం 87 పిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూములకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువ రాగా, ఉద్యోగం, ఉపాధి తదితర ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పద్మ శ్రీ, శ్రీనివాస్, సాయి బాబా, రాధా కిషన్, బ్రహ్మాజీ, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అలా వచ్చి ఇలా వెళ్లారు

వికలాంగురాలికి వీల్ చైర్

నవతెలంగాణ-మెదక్



పేదరికంతో పాటు నడవ లేని స్థితిలో ప్రజావాణికి వచ్చిన దివ్యాంగురాలికి అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు ప్రత్యేక చొరవచూపి వీల్ చైర్‌ను అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణికి వెల్దుర్తి మండలంలోని కుకునూర్ గ్రామానికి పోతుల మల్లేష్ దివ్యాంగురాలైన తన కూతురు తేజశ్రీతో కలిసి వచ్చారు. ప్రజావాణిలో వీల్ చైర్ కోసం అర్జీ పెట్టుకోగా వెంటనే స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు వీల్ చైర్‌ను అందజేశారు. 90 శాతం వైకల్యంతో నడవలేని పరిస్థితిలో ఉన్న తేజశ్రీకి వీల్ చైర్ అందించడంతో సంతోషంగా వెళ్ళారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా అయ్యప్ప దేవాలయ లెక్కలు

- ప్రతి చందాదారుడికి అకౌంట్స్ ఇవ్వడానికి సిద్ధం
- వ్యక్తిగత కక్షలతో కాంగ్రెస్ పార్టీ పేరుతో ఆరోపణలు
- దేవాలయానికి రాజకీయాలు అంటగట్టొద్దు

నవతెలంగాణ-రామాయంపేట



అయ్యప్ప దేవాలయం లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయని దేవాలయ గురుస్వామి, మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్ గౌడ్ తెలిపారు. రామాయంపేట పట్టణంలోని అయ్యప్ప దేవాలయం నిర్మాణం కోసం సేకరించిన విరాళాలు, ఆలయం వద్ద నిర్వహించిన ప్రైవేటు చిట్టీలలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన స్పందించారు. సోమవారం అయ్యప్ప దేవాలయంలో మాలాధారులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దేవాలయానికి కమిటీ లేదనే విషయం పూర్తిగా అబద్ధమని, ఆలయ నిర్మాణం, నిర్వహణ కోసం సేకరించిన విరాళాలు, ఇతర మార్గాల ద్వారా వచ్చిన నిధులకు సంబంధించి కమిటీ వద్ద లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయన్నారు. ఆలయ అభివృద్ధికి, నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి లెక్కలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరైనా గుడికి వచ్చి అడగవచ్చన్నారు. వ్యక్తిగత కక్షలతో తనపై ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆలయాలకు రాజకీయ పార్టీలకు సంబంధం ఏంటని, అయ్యప్ప దేవాలయానికి రాజకీయాలు అంటగట్టవద్దన్నారు. అవసరమైతే ఆలయ అభివృద్ధికి తన సొంత డబ్బు ఖర్చు చేయడానికైనా సిద్ధమన్నారు. అలాంటిది అయ్యప్ప దేవాలయం డబ్బులు తాను ఎలా వాడుకుంటానన్నారు. అవసరమైతే అయ్యప్ప దీక్ష పూర్తయ్యాక రాజకీయాలు చేద్దామన్నారు. గురుస్వామిగా తాను ఆదర్శంగా ఉంటానని, ఎక్కడ కూడా తాను అవినీతికి పాల్పడ లేదని తెలిపారు. అనవసరమైన ఆరోపణలు చేసి అయ్యప్ప స్వాముల మనోభావాలు దెబ్బతీయవద్దని ఆయన సూచించారు. ఇప్పటికీ కూడా అయ్యప్ప దేవాలయానికి సంబంధించి మూల నిధి ఉందని, దానికి వచ్చిన వడ్డీతో ఆలయ అభివృద్ధి నిర్వహణ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలాదారులు మర్కు నగేష్, దోమకొండ శ్రీనివాస్, దోమకొండ వెంకటి, ఫోటోలు మల్లారెడ్డి, బోడపుంటి స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం, స్పీకర్‌ను కలిసిన వైద్యనాథ్





నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షులు వైద్యనాథ్ సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్చం అందజేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా సీఎల్పీ లీడర్‌గా పనిచేసిన భట్టి విక్రమార్క రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని వైద్యనాథ్ తెలిపారు. అదేవిధంగా స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన గడ్డం ప్రసాద్ కుమార్‌ను కూడా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓటర్ లీస్టులో తప్పుల సవరణ చేయాలి

- తహసీల్దార్ తులసీరామ్



నవతెలంగాణ-వెల్దుర్తి

పంచాయతీ, పార్లమెంటు, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్ లీస్టులో తప్పుల సవరణ చేయాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్పించాలని తహసీల్దార్ తులసిరామ్ అన్నారు.మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బూతు లెవల్ అధికారులు, సూపర్వైజర్లకు ఓటర్ లీస్టు సవరణపై తహసీల్దార్ తులసీరామ్ పలు సలహాలు, సూచనలు చేశారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటర్ జాబితాలో పేరు నమోదు చేయించాలని సూచించారు. మరణించిన వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించాలని తహసీల్దార్ సూచించారు. ఒక ఓటర్ రెండుసార్లు నమోదు అయినట్లయితే ఒక స్థానం నుంచి తొలగించాలన్నారు. ఫామ్ 8 ద్వారా ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరొక పోలింగ్ స్టేషన్‌కు మార్చుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. జాబితా సవరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ, సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే తొలి సమీక్షా సమావేశం

నవతెలంగాణ-చిన్న శంకరంపేట



మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అధికారులతో మొట్టమొదటి సారిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ తమ నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి అవకతవకలు జరగకుండా, రూపాయి ఖర్చు లేకుండా సేవ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లవేళలా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు పట్టణంలోని సురేష్ గౌడ్ బేకరీని ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి గోపాల్ రెడ్డి. సర్పంచ్ రాజిరెడ్డి, ఎమ్మార్వో, ఎంపీడీవో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెదక్ ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు





నవతెలంగాణ-మెదక్

మెదక్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మొట్టమొదటి సారిగా మెదక్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప స్వామిని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వైద్యరాజు పంతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ నెల 27న జరగబోయే మహాపడిపూజకు ఎమ్మెల్యే దంపతులు రావాలని ఆహ్వానాన్ని అందజేశారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మెదక్ పట్టణంలోని మెదక్ కెథెడ్రల్ చర్చిని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలకు హాజరుకావాలని చర్చి కమిటీ నాయకులు ఆహ్వానాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ కొండన్ సురేందర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగా నరేందర్, యువ న్యాయవాది జీవన్ రావ్, బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, గూడూరి ఆంజనేయులు, గూడూరి క్రిష్ణ, కౌన్సిలర్‌లు ఆవారి శేఖర్, మహిళా నాయకురాలు హరిత, కీర్తి రితీష్, మాజీ కౌన్సిలర్‌లు తిమ్మన్నగారి అనిల్, మున్నా, మన్సూర్, మైసన్, జాయ్ ముర్రె, చిన్నశంకరంపేట మండల నాయకులు కొలుకూరి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం

నవతెలంగాణ- వెల్దుర్తి



మండల పరిధిలో బస్వాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో స్వయంభుగా వెలసిన శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంతాన నాగేంద్ర స్వామికి ప్రత్యేక అభిషేకములు, శ్రీవల్లి, దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం, శ్రీ గురు మదనానంద సరస్వతి పీఠాధీశ్వర్లు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగాయి. ఈ కళ్యాణ మహోత్సవంలో మండలంలో ఉన్న వివిధ గ్రామాల దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఒడిబియ్యం సమర్పించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ ఆలయ కమిటీ చైర్మెన్ తలారి మల్లేష్ మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి పడిగ నరసింహులు భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

4

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

సిద్దిపేట

మంగళవారం | 19 డిసెంబర్ 2023 | www.navatelangana.com

సవేరా హొటల్ ప్రారంభం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

యువత వ్యాపారంలో రాణించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సవేరా రెస్టారెంట్‌ను ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఎఫ్ డీ సీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వ్యాపారంలో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. గజ్వేల్ వ్యాపారాలకు అనుకూల ప్రాంతంగా మారిందన్నారు. వినియోగదారుల మన్ననలు పొందే విధంగా సవేరా హొటల్ నిర్వహించాలన్నారు. హొటల్ యాజమాన్యం లతీఫ్ వారి బృందం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియుద్దీన్, కౌన్సిలర్లు, డైరెక్టర్లు,బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు, లతీఫ్ ఖాన్,రషీద్ ఖాన్, మోయినోద్దీన్,జాఫర్ ఖాన్, సవేరా హొటల్ మేనేజ్మెంట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధన కోసం రేపు సమ్మె

నవతెలంగాణ-సిద్దిపేట

ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేవ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఈ నెల 20న సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లు దేశవ్యాప్తంగా ఒక రోజు సమ్మె ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఏ.కిరణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ (సేవల నిబంధనలు) చట్టం 1976కు రక్షణ కల్పించాలని, సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల కోసం చట్టబద్ధమైన పని నియమాలను రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, సంస్థలలో వైద్య ప్రతినిధుల ప్రవేశానికి సంబంధించిన అన్ని పరిమితులను తొలగించి, వారి పని హక్కును నిర్ధారించాలన్నారు. మందులు, వైద్య పరికరాల ధరలను తగ్గించాలని, జీఎస్టీని తొలగించాలని తెలిపారు. డేటా గోప్యతను రక్షించాలని డిమాండ్ చేశారు. యజమానులు కూడా విక్రయాలకు సంబంధించిన వేధింపులు ఆపాలన్నారు. ట్రాకింగ్, నిఘా ద్వారా గోప్యతలో చొరబాటు లేదని, పని ప్రదేశాలకు అడ్డంకులు లేకుండా ప్రవేశించేలా చూసుకోవాలని కోరారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఒకరోజు సమ్మెను చేయనున్నట్లు తెలిపారు. రిప్రజెంటేవ్‌లు సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మట్టిలో మాణిక్యం

- పట్టుదలతో శ్రమిస్తే గమ్యం నీ సొంతం
- బిగ్‌బాస్ విన్నర్ కావాలన్నది ఆయన ధ్యేయం
- గజ్వేల్ మండలం కొల్గూర్‌నివాసి పల్లవి ప్రశాంత్
- విన్నర్‌గా చరిత్ర సృష్టించిన రైతు బిడ్డ
- పలువురి అభినందనలు

సామాన్య రైతుబిడ్డ బిగ్‌బాస్ విన్నర్



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

తెలుగు 'బిగ్ బాస్' సీజన్ 7 ఇంతకు ముందు సీజన్లతో పోలిస్తే భారీగా సక్సెస్ అయింది. ఉల్టాపుల్టా కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను కట్టిపడేసింది. 100 రోజులకుపైగా ప్రేక్షకులను అలరించిన బిగ్‌బాస్ తెలుగు 7 గ్రాండ్ ఫినాలేకి చేరుకుంది. ఫైనలిస్ట్‌లుగా శివాజీ, ప్రశాంత్, యావర్, అమర్‌దీప్, ప్రియాంక, అర్జున్‌ను బిగ్‌బాస్ వారం క్రితమే అనౌన్స్ చేశారు. ఈ వారం వారిని ఇంట్లోనే ఉంచి.. ఫన్ టాస్క్‌లతో ఎంటర్‌టైన్ చేశాడు. ఇదిలా ఉంటే బిగ్‌బాస్ గ్రాండ్ ఫినాలే ఎపిసోడ్ షూటింగ్ జరగ్గా.. ఆదివారం ప్రసారం చేశారు. పలువురు హీరోయిన్స్, కంటెస్టెంట్స్ డ్యాన్సులతో హొరెత్తించారు. ఈ పోటీలో రైతుబిడ్డ పల్లవి ప్రశాంత్ టైటిల్ విన్నర్‌గా నిలిచారు. కప్పు కొట్టుకుని ఇంటికి వస్తానని బిగ్‌బాస్‌కి వెళ్లే ముందు అందరితో చెప్పాడు. పట్టుదలతో బాగా శ్రమించి చివరకు విన్నర్ అయ్యాడు. చివరికి ఆరుగురు ఫైనలిస్టుగా మిగిలారు. ఇందులో పల్లవి ప్రశాంత్, అమర్ దీప్, శివాజీ, యావర్, అర్జున్, ప్రియాంక ఫైనల్‌కు చేరుకున్నారు. నిన్నరాత్రి ఓటింగ్ లైన్లు మూసివేయబడ్డాయి. టీమ్ ఫైనల్ ఎపిసోడ్ షూటింగ్‌లో నిమగ్నమై ఉంది. ఆదివారం బిగ్‌బాస్-7 విన్నర్ ఎవరు అవుతారో అని ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఎందుకంటే అన్ని సీజన్ల మాదిరిలా కాకుండా.. ఈ సీజన్ ఉల్టాపుల్టా అని మొదటి నుంచి హొస్ట్ నాగార్జున గుర్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈసారి అన్ని ఎపిసోడ్లు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఆదివారం డిసెంబర్ 17 బిగ్‌బాస్ ఫైనల్ ఎపిసోడ్ ప్రసారం అయ్యింది.



పల్లవిది వ్యవసాయధారిత కుటుంబం

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన గొడుగు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులకు నలుగురు గొడుగు ప్రశాంత్ అలియాస్ పల్లవి ప్రశాంత్, మహవీర్, వినయ్, కుమార్తె గౌతమి సంతానం. కుమార్తె గౌతమికి వివాహం చేసి అత్తగారింటికి పంపారు. సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులది పూర్తిగా వ్యవసాయపై ఆధారపడి జీవించే కుటుంబం. ముగ్గురు కొడుకులతో పాటు భార్యాభర్తలు వ్యవసాయం చేసుకుంటూ జీవం కొనసాగిస్తున్నారు. పెద్ద కుమారుడు పల్లవి ప్రశాంత్ పూర్తిగా వ్యవసాయంపై పెంచుకొని పనిలో నిమగ్నమయ్యాడు.

పల్లవి ప్రశాంత్ కెరీర్

అతను రైతుగా తన దృక్కోణాలు, అనుభవాలను పంచుకోవడం కొనసాగించాడు. యూట్యూబ్‌లో కంటెంట్ మేకర్‌గా పల్లవి ప్రశాంత్ కెరీర్ వృద్ధి చెందింది. అతని వీడియోలు వ్యవసాయ జీవితం వాస్తవికతను చూపడంతో పాటు విస్తరిస్తున్న అతని ప్రేక్షకులకు విద్య, ప్రేరణ కోసం వనరు అందించాయి. అతని నిబద్ధత, చిత్తశుద్ధి వేగంగా గౌరవం ప్రశంసలను పొందాడు. తన యూట్యూబ్ కెరీర్‌కు సమాంతరంగా పల్లవి ప్రశాంత్ ఇన్‌స్టాగ్రామ్ ప్రపంచంలోకి ప్రవేశించాడు. అతను త్వరగా తన అభిమానుల సంఖ్యను 5.55 లక్షల వివర్స్‌కు పెంచుకున్నాడు. తన ఆన్‌లైన్ ఉనికిని మరింత పెంచుకోవడానికి, అతను తన కొత్త యూట్యూబ్ ఖాతాకు లింక్‌ను ఇక్కడ ప్రచురించాడు. ఎన్నో షార్ట్ ఫిలిమ్స్, పాటలు తీశారు.

మట్టిలో మాణిక్యం పల్లవి ప్రశాంత్

పల్లవి ప్రశాంత్ తెలంగాణ రాష్ట్రంలోని ఒక చిన్న గ్రామంలో జన్మించిన సామాన్య వ్యక్తి. అతను వ్యవసాయ ఆధారిత వాతావరణంలో పెరిగినందున అతనికి భూమి, వ్యవసాయం పట్ల బలమైన అనుబంధం ఉంది. గ్రామీణ వాతావరణంలో తన భవిష్యత్ కార్యక్రమాలకు పునాది నిర్మించుకున్నాడు. పల్లవి ప్రశాంత్, గ్రామీణ నేపథ్యం నుండి వచ్చినప్పటికీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ వాగ్దానాన్ని ప్రారంభంలోనే చూసింది. అతను యూట్యూబ్ ప్రపంచంలోకి ప్రవేశించడం ద్వారా తన ఆన్‌లైన్ సాహసయాత్రను ప్రారంభించాడు. అక్కడ అతను తన రోజువారీ కార్యకలాపాలు, వ్యవసాయ పనుల సంక్లిష్టతలను రికార్డ్ చేయడం ప్రారంభించాడు. 'అన్నా, అన్నా, నేను రైతు బిడ్డను, అన్నా, మల్ల ఒచ్చినా' అనే అతని క్యాచ్‌ఫ్రేజ్ ఆవిర్భావం. అతని ఆన్‌లైన్ వ్యక్తిత్వాన్ని మలుపు తిప్పిన వాటిలో ఒకటి.

కామన్‌మ్యాన్‌గా బిగ్‌బాస్‌లోకి ఎంట్రీ

ఓ కామన్‌మ్యాన్‌గా ఇంట్లోకి ఎంట్రీ ఇచ్చాడు. రైతుబిడ్డగా అందరి ప్రేమాభిమానాలు పొందాడు. బయట ఎంతో ఫ్యాన్స్‌ను సంపాదించుకున్నాడు. చివరికి ఓ రైతు బిడ్డ విన్నర్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. జరిగిన ఆరు సీజన్లలో ఇప్పటివరకు కామన్‌మ్యాన్‌గా ఎంట్రీ ఇచ్చిన వారు ఎవరూ విన్నర్ కాలేదు.



మొదటి సారి ఓ రైతు బిడ్డ విన్నర్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. సామాన్యమైన వ్యక్తి పట్టుదలతో శ్రమిస్తే ఇంతటి అసాధ్యమైనా సాధ్యం చేసుకోవచ్చని పల్లవి ప్రశాంత్ నిరూపించాడు. ఎలాంటి సెలబ్రిటీకాని పల్లవి ప్రశాంత్ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి బిగ్ సెలబ్రిటీగా మారారు. రన్నర్‌గా అమర్ దీప్ నిలిచారు. 3వ స్థానంలో శివాజీ, 4వ స్థానంలో యావర్, 5 ప్రియాంక, 6వ ప్లేస్‌లో అర్జున్ నిలిచారు. శనివారం జరిగిన ఎపిసోడ్‌లో బిగ్‌బాస్ రూ.15 లక్షల డబ్బులు ఆఫర్ చేయగా వాటిని యావర్ దక్కించుకుని బయటకు వచ్చారు. రన్నర్‌గా నిలిచిన అమర్ దీప్ రూ.25 లక్షలు తీసుకున్నారు. విన్నర్‌గా పల్లవి ప్రశాంత్ గెలిచినా... డబ్బుల విషయంలో మాత్రం యావర్, అమర్‌కే లక్కు కలిసొచ్చిందని ప్రేక్షకులు అభిప్రాయ పడుతున్నారు.

చిత్తశుద్ధిని ప్రశ్నించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

కాంగ్రెస్ నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షుడు శ్రవణ్



నవతెలంగాణ-బెజ్జంకి

కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్దిని ప్రశ్నించే అర్హత బీఆర్‌ఎస్ పార్టీకి లేదని మానకొండూర్ నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షుడు శానగొండ శ్రవణ్ సోమవారం హెచ్చరించారు. పదేండ్లు అధికారం కోసమే అరాటపడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను గారడి మాటలతో, అమలుకాని హామీలతో మభ్యపెట్టి మోసం చేసిందని అన్నారు. మరోమారు రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి బీఆర్‌ఎస్ కుట్రలు పన్నుతూ తీసుకున్న తప్పుడు నిర్ణయాలను కప్పిపుచ్చుకునే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లో రెండు హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రజలిచ్చిన ప్రతిపక్ష హొదా తీర్పును చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు.

మంత్రి కొండ సురేఖను కలిసిన దరిపల్లి చంద్రం



నవతెలంగాణ-సిద్దిపేట

అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు టీపీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హైదరాబాదులోని మంత్రి చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిపారు.

పొట్లపల్లిలో వైద్య శిబిరం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామంలో సోమవారం ప్రభుత్వ వైద్యాధికారులు ప్రజలకు బిపి, షుగర్ టెస్టులు చేపట్టారు. అనంతరం టెస్టులు చేసుకున్న వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ గ్రామాలలో రోగాల బారిన పడకుండా వైద్యాధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నికిత ,సూపర్ వైజర్ ఉల్లెంగుల కనకయ్య, సర్పంచ్ దేవసాని సుశీల, పంచాయతీ కార్యదర్శి పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

పెన్షనర్లు సకాలంలో జీవన ప్రమాణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు సమర్పించాలని జిల్లా ట్రెజరీ అధికారి ఎస్.బాలరాజు తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సిద్దిపేట జిల్లా, సిద్దిపేట, చిన్నకోడూరు, నంగునూరు, కొండపాక మండల యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో అఖిల భారత పింఛనుదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పెన్షన్ సాధనకు కృషి చేసిన మహనీయుడు డి.యస్.నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు తమ శాఖ పక్షాన ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అండగా ఉంటానని అన్నారు. విశిష్ట అతిథి విశ్రాంత ఉద్యోగుల సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు అమ్మన చంద్రా రెడ్డి మాట్లాడుతూ డి.యస్ నకార కృషి వల్లనే ఈ రోజు పింఛను దారులు ఆనందంగా ఉన్నారన్నారు. వృద్ధ పెన్షనర్లకు సంఘం చేస్తున్న సేవలను, సంఘం జిల్లా శాఖ, మండల శాఖలు చేస్తున్న కృషిని, సామాజిక కార్యక్రమాలను సవివరంగా వివరించారు. ఎల్లవేళలా పెన్షనర్లకు అందుబాటులో ఉండి, సహాయ సహకారాలందిస్తామన్నారు. విశేష సేవలందించిన పన్నెండు మంది సీనియర్ పెన్షనర్లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ మంజిత్ కౌర్, జిల్లా కార్యదర్శి ఆర్ .రాజిరెడ్డి, జి.మహంకాళి, ఎ.రాములు, ఎ.భూంరెడ్డి, వి.గాల్ రెడ్డి, ఎల్లారెడ్డి, రాములు, రాజిరెడ్డి, జె.సత్యం తదితరులు పాల్గొన్నారు.

మాచాపూర్ గ్రామ పంచాయతీ రికార్డుల తనిఖీ



నవతెలంగాణ - చిన్నకోడూరు

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు, అవినీతి రహిత సమాజాన్ని స్థాపించే విధంగా కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్(సిసిఆర్) సంస్థ కృషి చేస్తుందని సిసిఆర్ సెంట్రల్ కమిటీ సభ్యులు భూక్య చంద్రకాంత్ అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్(సిసిఆర్) సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. సమాచార హక్కు చట్టం ప్రకారం గతంలోనే రికార్డు తనిఖీలకు అనుమతి పొందామని జిల్లా అధ్యక్షులు గుండ్ల శివచంద్రం అన్నారు. ఈ సందర్భంగా సిసిఆర్ సెంట్రల్ కమిటీ సభ్యులు భూక్య చంద్రకాంత్ మాట్లాడుతూ పారదర్శక పాలనే లక్ష్యంగా సిసిఆర్ పనిచేస్తుందని తెలిపారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు, అవినీతి రహిత సమాజాన్ని స్థాపించే విధంగా తమ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. అందులోభాగంగానే సోమవారం మాచాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డు తనిఖీలు నిర్వహించమన్నారు. రికార్డుల తనిఖీకి సంబంధించి ఏవైనా అవకతవకలు గుర్తిస్తే త్వరలోనే డ్రాఫ్టింగ్ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భరద్వాజ్, ఫారూఖ్ అలీ, రత్నాకర్, రాజు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మీరు వస్తే.. మా కష్టాలు చెప్పుకుంటాం

- సీఎం హొదాలో రేవంత్‌రెడ్డి గజ్వేల్‌లో పర్యటించాలి
- నిర్వాసితులకు న్యాయం జరగాలని ప్రతిపక్షం హొదాలో రేవంత్‌రెడ్డి దీక్ష
- ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి హామీ
- యువతకు ఉపాధి అవకాశాలు
- చేతి కులవృత్తులు నిర్వీర్యం చేసిన గత ప్రభుత్వానిది



నవతెలంగాణ-గజ్వేల్

మేము మీ కళ్ల ముందట మా కష్టాలు చెప్పుకోవాలంటే సీఎం హొదాలో రేవంత్‌రెడ్డి గజ్వేల్‌లో పర్యటించాలని నిర్వాసితులు కోరుతున్నారు. నిర్వాసితుల కష్టాలను నిలువెత్తుగా చూడాలంటే ఇక్కడికి వచ్చి పరిశీలిస్తే తెలుస్తుంది. గత ప్రభుత్వం గజ్వేల లో గాలి మేడలు కట్టి అందులో మమ్ములను ఉంచింది. ఉండేందుకు సరైన గృహాలు లేవు. వర్షాలు వస్తే ఊరుస్తున్నాయి. ఉండేందుకు వీలు లేకుండా పోతోంది. నాణ్యతాలోపాలు అధికంతో కాలనీలో నిర్వాసితుల కష్టాలు అంతాఇంత కాడు. రాత్రికిరాత్రి గ్రామాలను ఖాళీ చేయించి గజ్వేల్ పట్టణానికి డీసీఎంలో తరలించారు. నిర్మించిన ఇండ్లు ఎప్పుడు కూలిపోతాయో తెలియదు. పెండింగ్లో ప్యాకేజీ ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదు. మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పడం తప్ప ఏమి చేయలేదు. చనిపోతే కాడి ఏడ పేర్చాలో తెలియని దుస్థితిలో నిర్వాసితుల కుటుంబాలు కొట్టుమిట్టాడుతున్నాయి. సామాజిక వర్గాలకు స్మశాన వాటికలు లేవు. ఎక్కడా ఖాళీ స్థలం ఉంటే అక్కడే దహనసంస్కారం చేస్తున్నారు. దీంతో కాలనీలో నివసిస్తున్న నిర్వాసితులు ఇబ్బందులకు గురవుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోలేదు. చట్టం ప్రకారం నిర్వాసితులకు అన్ని వర్తించాలని అప్పటి టీపీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములగట్టులో దీక్ష చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో నిర్వాసితులకు పెండింగ్లో ఉన్న అన్ని సౌకర్యాలు ప్యాకేజీలు అందే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం నిర్వాసితులు రేవంత్‌రెడ్డి పై ఆశలు ఇచ్చారుపెట్టుకున్నారు.

గతంలో దీక్ష చేసిన రేవంత్

భూములు తీసుకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇప్పుడు తమ బాధలు ఎవరు తీర్చుతారనే ఆవేదనలో కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన భూనిర్వాసితులు ఉన్నారు. జిల్లాలోని తొగుట, కొండపాక మండలాల పరిధిలో నిర్మించిన మల్లన్నసాగర్ భూనిర్వాసితుల కష్టాలు తీరడం లేదు. మల్లన్నసాగర్ పరిధిలోని 14 గ్రామాలు, ములుగు మండలం పరిధిలోని కొండపోచమ్మ సాగర్‌లోని 4 గ్రామాలు కోల్పోయారు. నిధుల లేమి కారణం, గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో భూనిర్వాసితులు కొందరు తమ ప్రాణాలు వదిలారు. పలువురు ఉపాధి లేక పట్టణాలకు వలసపోతున్నారు. ఇంకా కొందరు తమకు దక్కాల్సిన నష్టపరిహారం, ప్లాట్లు, ఇతరత్రావాటి గురించి కార్యాలయాల చుట్టూ మూడేళ్లుగా తిరుగుతూనే ఉన్నారు. తమ సమస్యలు తెలిసిన నాయకుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో కొంత ఊరట పొందారు. గతంలో మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల సమస్యలపై అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీక్ష చేయడం, భూని ర్వాసిత రైతులు, ప్రజల సమస్యలు పూర్తిస్థాయిలో అవగా హన ఉండడంతో ఆయనపైనే ఆశలు పెంచుకున్నారు. నిర్వాసితులకు ప్యాకేజీ పెండింగ్లో ఉంది. ఒంటరి మహిళలకు ఎలాంటి సాయం చేయలేదు. మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

పెండింగ్లో ప్యాకేజీ, ప్లాట్ల కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పన

మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు పలువురికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్యాకేజీలు పెండింగ్లో ఉండడం, మరికొంత మందికి ప్లాట్ల కేటాయింపు జరగకపోవడం, ఇంకా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 20 వేల మంది నివసిస్తున్న కాలనీలో స్మశాన వాటికలు లేవు. అంగన్వాడీ భవనాలు, పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాల్సి ఉన్నది. కాలనీలో ఇప్పటికే చేపట్టిన కల్వర్టులు, మురుగు కాలువలు, రోడ్లు ధ్వంసం అయ్యాయి. వాటిని బాగు చేయాల్సిన అవసరం ఉన్నది. అంతేకాకుండా ముస్లిం గ్రేవీ యార్డు, క్రిస్టియన్ల శ్మశానవాటిక నిర్మించాల్సి ఉన్నది. ఈ సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెడితే సాధ్యమవుతుందని నిర్వాసితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

యువతకు ఉపాధి కరువు

మల్లన్నసాగర్, కొండపోచమ్మ జలాశయం కింద గ్రామాలు కోల్పోయిన చదువుకున్న యువతకు ఉపాధి కూడా చూపించలేదు. ఇతర ప్రాంతాలకు వెళ్లే అడ్డా కూలీలుగా పని చేస్తున్నారు. డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ చేసిన యువతీ యువకులు ఏం చేయని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసి గజ్వేల్‌లో ఉపాధి చూపిస్తామని గొప్పలు చెప్పింది. కులవృత్తులు, చేతి వృత్తులవారు పూర్తిగా అడ్డా కూలీలుగా మారి పోయారు. దీంతో బతుకుతెరువు భారంగా మారింది. ఇతర పట్టణాలకు వలస పోయారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని నిర్వాసితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండలం బందారం గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నిమ్మ దుర్గారెడ్డి, అధ్యక్షుడిగా పాలడుగు బాల్ రెడ్డిలు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహిపాల్ రెడ్డి, కార్యదర్శిగా పరమేశ్వర్ రెడ్డి, సలహాదారులుగా కామిరెడ్డి నరసింహారెడ్డి, నర్రా నర్సింహారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా తిరుమల్ రెడ్డి కరుణాకర్ రెడ్డిలతో కార్యవర్గం ఏర్పాటయింది.

పాఠశాలలో ఇంధన పొదుపు వారోత్సవాలు

నవతెలంగాణ-కొండపాక

ఇంధన అభివృద్ధి సంస్థ, పాఠశాల పిడి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీహె చ్ఎస్‌లో సోమవారం ఇంధన పొదుపు వారోత్సవ కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇంధనాన్ని పొదుపు చేయడంలో తీసుకోవాల్సిన పద్ధత ఎలను భాస్కర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య షష్టి మహెూత్సవం



నవతెలంగాణ-వర్గల్

తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో సోమవారం శ్రీసుబ్రహ్మణ్య షష్టి మహెూత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆలయ సభా మండప ంలో వైభవంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపైకి శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం సుమారు మూడు గంటల పాటు స్వామివారి కల్యాణ మహెూత్సవం జరిగింది. ఎదుర్కోలు మహెూ త్సవం, జిలకర బెల్లం సమర్పణ, యజ్ఞోపవీత ధారణ, మాంగల్య ధారణ తదితర ఘట్టాలు కన్నులపండువగా జరగాయి. బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ప్రసంగిస్తూ శ్రీ మహా శివుడికి అత్యంత ఇష్టమైన సోమవారం శ్రీ సుబ్రహ్మణ్య షష్టి రావడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. తారకాసుర సంహారం కోసం దేవతల కోరిక మేరకు పరమ శివుని అంశతో సర్వశక్తి మంతుడైన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి జన్మించి కారణరూపుడిగా ప్రసిద్ధికెక్కినట్లు చెప్పారు. స్వామి వారు దయార్ధ హృదయుడిగా, కరుణామ యుడిగా, పిలిస్తే పలికే దైవంగా ప్రసిద్ధికెక్కి కోరిన కోర్కెలు తీర్చే దైవంగా నిలిచి భక్తుల పాలిట కొంగుబంగారం గా విలసిల్లుతు న్నట్లు స్పష్టం చేశారు. శ్రీసుబ్రహ్మణ్య ఆరాధన సర్వశుభాలనిస్తూ సంతాన ప్రాప్తి కలుగుతుందని, ఎంతో విశిష్ట మైన సుబ్రహ్మణ్య షష్టి సంద ర్భంగా జరిగే శ్రీవల్లి దేవసేన కల్యాణ మహెూత్సవ ంలో భాగస్వా ములైన భక్తులకు అంతా మంచి జరుగు తుందన్నారు. కాలసర్ప దోష నివారణకు సుబ్రహ్మణ్య ఆరాధన అన్ని విధాలా శ్రేయస్కరమని, లోక కళ్యాణార్థమై నిర్వహించిన శ్రీ సుబ్రహ్మణ్య షష్టి మహెూత్సవం ప్రతి ఒక్కరికి సత్ఫలితాలు ఇవ్వాలని ఆకాంక్షించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ప్రజాసంక్షేమ పథకాలను వికసిత భారత్ సంకల్ప యాత్రతో గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం హుస్నాబాద్ మండల ంలోని పందిళ్ళ గ్రామంలో సర్పంచ్ తోడేటి రమేష్ అధ్యక్షతన వికసిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాలు అందరు వినియోగించుకొని లబ్దిపొందాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మానస, ఎంపీటీసీ జయలక్ష్మి, ఎంపీడీఓ రాఘవేంద్ర రెడ్డి, యూకో బ్యాంకు మేనేజర్, హుస్నాబాద్ మండల వైద్యఅధికారి నిఖిత, కో ఆర్డినేటర్, బీజేపీ జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక, రాజకీయ, సాంస్కృతిపై ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-గజ్వేల్



సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, భౌతిక అంశాలపై విశ్వజన కళామండలి పనిచేస్తుందని విశ్వజన కళామండలి జాతీయ జాయింట్ సెక్రెటరీ బాల్ నరసయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కళారూపకంగానే కాకుండా ఆర్థిక సామాజిక అంశాలపై కవులు, కళాకారులు రాజ్యాధికారం అందుకునే విధంగా కళాకారులు, గాయకులు నాయ కులను తయారు చేస్తుందన్నారు. విశ్వజన కళామండలి బాధ్యతను తనకు అప్పగించడంపై డాక్టర్ మాస్టర్, కోలాపురం నర్సింగరావు, టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ టి రాజు, రాష్ట్ర నూతన అధ్యక్షుడైన అందే భాస్కర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈటెల భరోసా ఇచ్చినా.. బీజేపీ క్యాడర్లో అంతర్మథనం



నవతెలంగా -గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గం బీజేపీలో చేరిన కొత్త క్యాడర్ అంతర్మథనంలో పడింది. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో కార్యకర్తల సమావేశం పెట్టి మాజీ మంత్రి ఈటల రాజేందర్ కార్యకర్తలకు, నాయకులకు పాత కొత్త కాకుండా పార్టీ కోసం పని చేయాలని సూచించారు. కొత్త క్యాడర్ కొంత అయోమయానికి గురవుతోంది. పాత క్యాడర్ నాయకులు అక్కడక్కడా కొత్త క్యాడర్‌పై గుస్సా వ్యక్తం చేస్తున్నారు. దీంతో పార్టీలో ఉండాలా మరో పార్టీలోకి జంపు కావాలా అని ఆలోచనలో పడ్డారు. మాజీ మంత్రి ఈటల రాజేందర్ మాత్రం పార్టీలో ఉండాలని.. నేనున్నానని చెప్పుకొస్తున్నారు. గజ్వేల్, ములుగు, జగదేపూర్, మర్కుక్, వర్గల్, తూప్రాన్, మనోరా బాద్, కుక్కునూరు పల్లి, కొండపాక మండలం చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత లు బీజేపీలో చేరి పని చేసినప్పటికీ ఫలితం దక్కక పోవడంతో అసంతృప్తికి గురవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి సీనియర్ నేత జశ్వంత్ రెడ్డి, కాంగ్రెస్ బీసీ నేత గుంటుక శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీలో ఉన్న బీసీలు, ముదిరాజులు బీజేపీలో చేరారు.

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టేకులపల్లి రామ్ రెడ్డి, మాజీ ఎంపీపీలు మల్లంరాజు, వెంకట్ రెడ్డి, గుమ్మడి శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి సింగం సత్తయ్య, తో పాటు మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, రాందాస్ గౌడ్ బీజేపీలో చేరారు. బీజేపీ నేత ఈటల రాజేందర్‌ను నమ్ముకుని గజ్వేల్ నుంచి ఆ పార్టీ లో చేరిన క్యాడర్ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుంచి మాజీ సీఎం కేసీఆర్ పై ఈటల రాజేందర్ పోటీ చేసి ఓడిపోయారు. తానే గెలుస్తానని, సీఎం కేసీఆర్‌ను ఓడిస్తున్నానని ఆయన చేసుకున్న ప్రచారంతో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు సీనియర్లు. నాయకులు బీజేపీలో చేరిపోయారు. బీజేపీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ ఎన్నికల ఫలితాల తరువాత షాక్ తిన్నది. కేసీఆర్‌పై పోటీ చేసి ఈటెల ఓడిపోయారు. గజ్వేల్‌లోనే కాకుండా హుజురాబాద్‌లో కూడా ఓటమి చెందారు. ఈటల ఓటమి, రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్, గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్.. ఈ వరుస పరిణామాలతో బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన క్యాడర్ దిక్కుతోచని స్థితిలో పడింది. మొన్నటి వరకు రాష్ట్ర ముఖ్యమంత్రే గజ్వేల్ నుంచి ప్రాతినిథ్యం వహించిన విషయం తెలిసిందే. వందల కోట్లతో గజ్వేల్‌లో అభివృద్ధి పనులు జరిగాయి కూడా. అయితే ఇక్కడి బీఆర్ఎస్ క్యాడర్ మంత్రం సంతోషంగా ఉండేది కాదు. కేవలం నలుగురైదుగురు నాయకులకు మినహా పార్టీలో ఎవరికి కనీసం విలువలేదని సెకండ్ క్యాడర్ కొద్ది రోజులుగా నిరసిస్తున్నది. ఈ సమయంలోనే బీజేపీ నేత ఈటల రాజేందర్ గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్నా అంటూ అడుగుపెట్టారు. ఇంకేముంది అప్పటికే పార్టీ అధిష్టాన తీరును నిరసిస్తున్న నాయకులు రాజేందర్ వైపు వెళ్లారు. అంతే కాకుండా రాజేందర్ ముదిరాజ్, బీసీ నినాదం తీసుకోవడంతో బీసీ నాయకులు కూడా ఆయన వెంట నడిచారు. గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మొదట బీజేపీలో చేరి నాయకత్వం వహించారు. నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్ పై కోపంగా ఉన్న నాయకులతో మాట్లాడి పార్టీలోకి చేర్పించారు. వర్గల్, ములుగు, తూప్రాన్, గజ్వేల్. జగదేవ్ పూర్, కొండపాక, మర్కుక్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరిపోయారు. కొంత క్యాడర్ చేరడంతో బీజేపీ బలపడినట్లు నాయకులు మురిసిపోయారు. కేసీఆర్, ఈటల రాజేందర్ పోటీతో రాష్ట్రంలోనే గజ్వేల్ ఎన్నికకు ప్రాధాన్యత సంతరించు కున్న విషయం తెలిసిందే. ప్రభు త్వంతో పాటు అప్పటి సీఎం కేసీఆర్ పై తీవ్ర వ్యతిరే కత ఉన్నదని తానే గెలుస్తున్నానని ధీమాతో ప్రచారం చేసు కున్నారు. మరోవైపు హుజురాబాద్ లో కూడా పోటీ చేసిన రాజేందర్ అక్కడికంటే గజ్వేల్ పైనే ఎక్కువ దృష్టి పెట్టారు. ఫలితాలు చూస్తే రెండు చోట్ల ఆయన ఓటమి పాలయ్యారు. గజ్వేల్ కేసీఆర్‌కు భారీ మెజార్టీ రావడంతో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన నాయకులు షాక్ తిన్నారు. నమ్ముకున్న ఈటల రాజేందర్ ఓడిపోవడం తో పాటు రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం రావడాన్ని వారు జీర్ణించుకోలేకపోతు న్నారు. అంతే కాకుండా గజ్వేల్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు మాజీ మంత్రి హరీష్ రావుకు ముఖం ఎలా చూపించుకుంటా మని తీవ్ర మదనపడు తున్నారు. అంతర్మథనంలో పడినట్లు పార్టీ లో చర్చ జరుగు తున్నది. గజ్వేల్ తో పాటు హుజురాబాద్‌లో ఓటమి చెందిన ఈటల రాజేందర్ ఇక గజ్వేల్ రాజకీయా లకు దూరంగా ఉండే అవకాశాలున్నాయ ని ఆ పార్టీలో చర్చ జరుగుతున్నది. త్వరలో జరగ బోయే ఎంపీ ఎన్నికల్లో మరో చోట నుంచి ఎంపీగా పోటీ చేయను న్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతానికి రాజేందర్ గజ్వేల్ వివిధ కార్యక్రమాలకు హాజర వుతూ క్యాడర్‌కు నేనున్నాననే భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల నియోజకవర్గంలోని తొమ్మిది మండ లాల్లో బీజేపీ క్యాడర్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో కార్యకర్తలు నాయకులకు నా ఇల్లు ఎప్పు డు తలుపులు తెరుచుంటాయని ఈటెల చెప్పు కొచ్చారు. బీజేపీలో చేరిన కొత్త క్యాడర్ సమాలోచన చేస్తు న్నట్లు తెలిసింది. కొందరు ముఖ్య నాయకులను తిరిగి పార్టీలో తీసుకు రావాలని బీఆర్ఎస్ సీనియర్లు భావిస్తున్నట్లు తెలి సింది. ఈ సంవ త్సరం మొత్తం ఎన్నికల ఉన్నందున మంచి బాధ్యతలు అప్పగించాలని ప్రయత్నం చేస్తుంది. ఇది ఎంత వరకు సాధ్యమవుతుందనేది క్యాడర్ నిర్ణయం బట్టి ఉంటుంది.

భట్టి విక్రమార్కను కలిసిన నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ప్రజాభవన్‌లో, అటవీశాఖ మంత్రి కొండ సురేఖను సచివాలయంలో సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షులు బొమ్మల యాదగిరి, సిద్దిపేట అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలిమి బిక్షపతి, రాష్ట్ర కిసాన్ సెల్ కన్వీనర్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజ్ బహదూర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు సాయం



నవతెలంగాణ-కొమురవెల్లి

ఇటీవల గురువన్నపేట గ్రామస్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందించారు. బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం, 50 కేజీల బియ్యాన్ని అందించారు. సందర్భంగా పౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ గ్రామంలో చనిపోయిన కుటుంబాలకు నా వంతుగా ఈ ఆర్థిక సాయంతో పాటు, బియ్యం అందజేయడం జరిగిందని వారి కుటుంబాలకు మనోధైర్యం కోసమే ఈ సహాయం చేయడం జరిగిందని తెలిపారు... అలాగే భవిష్యత్తులో వారి కుటుంబ సభ్యులకు బీ ఆర్ ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు, మా ఫౌండేషన్ అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వైనాల నిర్మల పరుశురాములు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడిస్) గరిమా అగ్రవాల్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి అర్జిదారులు ఈ ప్రజావాణికి తరలి వచ్చి అదనపు కలెక్టర్ దరఖాస్తులు సమర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు. భూ సంబంధిత, రెండు పడక గదుల ఇళ్ళు, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 25 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, డిఆర్డిఎ పిడి జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గొర్ల పంపిణీలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

- బీజేవైఎం మండలాధ్యక్షుడు తూముల రమేశ్ యాదవ్ డిమాండ్
- గొర్ల యూనిట్లకు చెల్లించిన నగదు తిరిగివ్వాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-బెజ్జంకి

గొర్ల పంపిణీ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల, కుర్మ, యాదవులను మోసం చేసిందని, గొర్ల యూనిట్ల పంపిణీలోని అవకతవకలపై ప్రభుత్వం విచారణ చేపట్టి న్యాయం చేయాలని బీజేవైఎం మండలాధ్యక్షుడు తూముల రమేశ్ యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గొర్ల పెంపకందారుల సంఘం అధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండోవిడత గొర్ల పంపిణీలో గొర్ల యూనిట్ల కోసం గొల్ల, కుర్మ, యాదవులు సుమారు రూ.43,750 నగదును బ్యాంక్ డీడీతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి చెల్లించారని, నేటికి గొర్ల యూనిట్లను పంపిణీ చేయకుండా మోసం చేసిందన్నారు. గొర్ల యూనిట్ల కోసం చెల్లించిన నగదుకు వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాలని, లేనిపక్షంలో గొర్ల యూనిట్లను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కేబినెట్‌లో యాదవులకు సముచిత స్థానం కల్పించా లని కోరారు. బీజేపీ మండల కార్యదర్శి వడ్లూరీ శ్రీనివాస్, ఓబీసీ మోర్చ మండలాధ్యక్షుడు బండిపెల్లి సత్యనారాయణ, పట్టణాధ్యక్షుడు సంగ రవి యాదవ్, నాయకులు రవి గుప్తా, అట్ల లక్ష్మన్, ఎలా సంతోశ్ తదితరుల పాల్గొన్నారు.

శతక పద్యార్చన



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

తానా(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) 100 తెలుగు సంఘాల సమన్వయంతో 'చిగురు మళ్ళ శ్రీనివాస్' వందే విశ్వమాతరమ్ పేరుతో నిర్వహిస్తున్న 100 దేశాలలో శాంతి సద్భావన యాత్రలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా10 లక్షల మంది విద్యార్థులతో అమ్మ, నాన్న, గురువు, శతకాల నుంచి శతక పద్యార్చనలో భాగంగా జ.ప.ఉ.పా. బక్రిచెప్యాల లో 32 విద్యార్థులతో పద్య పఠనం చేశారు. తెలుగు భాషోపాధ్యాయులు వరుకోలు లక్ష్మయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు డి.నాగేందర్ రెడ్డి, పూర్ణచందర్ రావు, అనిల్ కుమార్, సుహాసిని, శ్రీశైలం, శ్రీకాంత్, సరిత, ఆంజనేయులు, భూలక్ష్మి, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ ప్రారంభం



నవతెలంగాణ-తొగుట

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మగ్గం శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీటీసీ కొమ్ము శరత్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కుంబాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని గణపూర్ గ్రామంలో నాబార్డ్ వారి సహకారంతో ఐడియల్ రూరల్ డెవలప్మెంట్ సొసై ట (ఐఆర్డిఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. శరత్ మాట్లాడుతూ మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఇలాంటి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం అందిస్తామని ఏపీఎం మగ్దుంఅలీ సూచించారు. 15 రోజుల శిక్షణలో భాగంగా మధ్యాహ్నం భోజనంతో పాటు రూ.750ల స్టైపండ్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీనివాస్, వివోఏలు రాజశేఖర్, మమత సంస్థ డైరెక్టర్ రాజలింగం, ట్రైనర్ రజితలు, 30 మంది మహిళలు పాల్గొన్నారు.

స్పీకర్‌ను అభినందించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-రాయపోల్

తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి అభినందనలు తెలియజేయడం జరిగిందని రాయపోల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తప్పటి సుధాకర్ అన్నారు. సోమవారం హైదరాబాదులో సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కలిసి సన్మానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, కెసిఆర్ నియంత పాలన నుంచి విరక్తి చెందిన రాష్ట్ర ప్రజలు ఇటీవల జరిగిన శాసనసభ సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే సామాజిక న్యాయం, పేద బడుగు బలహీన, సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పని చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటి దళితుడికి స్పీకర్ పదవి ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. తెలంగాణ స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కుమార్ సమర్థవంతంగా శాసనసభ సమావేశాలను నిర్వహిస్తారని అన్నారు. శాసనసభ సంప్రదాయాలు పాటిస్తూ అధికార పక్షం, ప్రతిపక్షం అంటూ పక్షపాతం లేకుండా శాసనసభ సమావేశాలు నిర్వహిస్తారని, చట్ట సభలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టే బిల్లులకు సంపూర్ణ మద్దతుతో చట్టలుగా అమలు జరిగేలా, రాష్ట్ర ప్రజలకు మేలు జరిగే విధంగా సమావేశాలు నిర్వహించాలని ఆశిస్తు న్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు పడాల రాములు, రాయపోల్ మండల అధికార ప్రతినిధి కృష్ణ గౌడ్, నాయకులు దుర్గ ప్రసాద్, గొల్లపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తానా అమ్మ నాన్న గురువు పద్యార్చన



నవతెలంగాణ-కొండపాక

కొండపాకలోని రాఘవేంద్ర టాలెంట్ స్కూల్‌లో తానా అమ్మ నాన్న గురువు పద్యార్చన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానాతో పాటు 100 దేశాల్లో ఉన్న వందకు పైగా తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్ళ శ్రీనివాస్ శాంతి సద్భావన యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా తానా అమ్మ నాన్న గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొం టున్నారు. కొండపాక రాఘవేంద్ర టాలెంట్ స్కూల్ విద్యార్థులు చిగురుమళ్ళ శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, నాన్న శతకం, గురువు శతకాల లోని పద్యాలను కంఠస్థం చేసి 50 మంది సామూహిక గానం చేశారు. కరెస్పాండెంట్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పెద్దల పట్ల గౌరవం పెంచడానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రధానోపాధ్యాయులు రాజశ్రీ, ఉపాధ్యాయులు లత, సౌందర్య, సంధ్య, నేహా, స్రవంతి, అఖిల, మమత, ఊర్మిళ, నవ్య, హైమజ్యోతి, మహేంద్రం పాల్గొన్నారు.

స్పీకర్ ప్రసాద్ కుమార్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-రాయపోల్



తెలంగాణ రాష్ట్ర నూతన శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలపడం జరిగిందని రాయపోల్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సత్తుగారి రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ స్పీకర్ కార్యాలయంలో కలిసి శుభాకా ంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ఎన్నికల బరిలో నిలిస్తే విశ్వసించిన రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఆదరించి ఓటు వేయడం జరిగిందని, ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ శాసనసభ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ను నియమి ంచడం జరిగిందన్నారు. ఆయనకు రాయపోల్ మండలం కాంగ్రెస్ పార్టీ పక్షాన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు. రానున్న ఐదు సంవత్సరాలలో శాసనసభ సమావేశాలు సమర్ధవంతంగా నిర్వహించాలని కోరుకోవడం జరిగిందన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సోమవారం మండల అధ్యక్షురాలు రాగల సుగుణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎలాంటి చర్చలు లేకుండానే సాదాసీదాగా నిర్వహించారు. అధికారులు తమ తమ అభివృద్ధి నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చింతల సాయిబాబా గౌడ్ మాట్లా డుతూ గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శిని, పిఆర్ ఏఈ తిరుపతిరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ సత్యం, ఇరిగేషన్ ఏఈ భాగ్యలక్ష్మి, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దేవి రవీందర్, ఎంపీఈఓ వీరస్వామి, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-నంగునూరు

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు దేవులపల్లి రాజమౌళి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి మూడు నెలల నుండి వేతనాలు చెల్లించకపోతే ఏవిధంగా కుటుంబ పోషణ జరుగుతుందన్నారు. గ్రామీణ స్థాయిలో పారిశుద్ధ పనులు నిర్వహించడం, వీధి లైట్లు వేయడం, మంచినీటిని ప్రజలకు అందించడం వంటి మల్టీపర్పస్ పనులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నామ న్నారు.రోజుకు 12 గంటలు గ్రామాలలో విధులు నిర్వహిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండి తమ సేవలను అందిస్తున్నామన్నారు. మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోతే మేము ఏమీ తిని పనులు నిర్వహించాలని ప్రశ్నించారు. మూడు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- విచారణ జరిపించి న్యాయం చేయాలి



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్ (35) అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన తన స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న సందర్భంలో వారి మధ్యలో గొడవలు తలెత్తాయి. ఈ గొడవను గమనించిన కొందరు గొడవ సద్దుమణిగేలా చేశారు. గొడవ సద్దుమణిగిన తర్వాత అక్కడి నుంచి అందరూ వెళ్ళిపోగానే, అక్కడ పడిపోయిన శ్రీనివాస్‌ను అదే గ్రామానికి చెందిన వ్యక్తి తన ఆటోలో ఎక్కించుకొని ఇంటికి తీసుకువెళ్లి స్పృహ కోల్పోయిన విషయాన్ని కుటుంబ సభ్యులకు వివరించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అదే ఆటోలో శ్రీనివాస్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పేకాట ఆడుతున్న సందర్భంలో జరిగిన ఘర్షణతో తన భర్త మృతి శ్రీనివాస్ చెందాడని అతడి మృతి పట్ల పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మృతుడి భార్య దండు రాధ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారని అతడు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని పోలీసులు తెలిపారు.

పందిల్లలో కోతుల బెడద లేకుండా చేస్తా



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పందిల్ల గ్రామంలో కోతుల బెడద లేకుండా చేస్తానని సర్పంచ్ తోడేటి రమేష్ అన్నారు. సోమవారం పందిల్ల గ్రామంలో కోతులను పట్టేందుకు బోన్‌లను ఏర్పాటు చేశారు. 150 కోతులను పట్టినట్లు తెలిపారు. పట్టిన కోతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటిని కాళేశ్వరం ఏరియాలో వదులుతామన్నారు. గ్రామంలో కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కోతులతో అనేక సమస్యలు ఎదుర్కోవడం వల్లే కోతులను పట్టే కార్యక్రమం చేపట్టామన్నారు.